ANDHRAJYOTHY
ఆంధ్రజ్యోతి
మహబూబాబాద్
3
మంగళవారం 6 ఫిబ్రవరి 2024



రేపు గుడిమెలిగె పండుగ

మేడారం, ఫిబ్రవరి 5: మేడారం మహాజాతరకు అంకురార్పణగా బుధవారం వనదేవతలకు గుడిమెలిగె పండుగను నిర్వహించ నున్నారు. ఇందుకోసం పూజారులు ఏర్పాట్లు చేస్తున్నారు. పూజారులు బుధవారం వేకువజామున లేచి ఇంటిల్లి పాది అటవీ ప్రాంతాలకు వెళ్లి గుట్టగడ్డిని, పుట్ట మట్టిని తీసుకొని వస్తారు. చెప్పులు లేకుండా, ఉపవాసాలు చేసి తల్లుల గర్భగుడులను శుభ్రంచేస్తారు. అనంతరం డోలి వాయిద్యాల మధ్య గుడిమెలుగు పండుగను కొనసాగిస్తారు. ఈ వేడుకలో పూజారులు వారి కుటుంబసభ్యులతో పాటు గ్రామస్థులు, దేవాదాయ శాఖ అధికారులు పాల్గొననున్నారు.



వన దేవతలకు ముందస్తు మొక్కులు..

- మేడారానికి భారీగా తరలొస్తున్న భక్తులు
- సుమారు 50వేల మంది రాక

4



నిలువెత్తు బెల్లం(బంగారం)తో వనదేవతల దర్శనానికి వస్తున్న మంత్రులు సీతక్క, ప్రభాకర్, ఆర్టీసీ ఎండీ సజ్జనార్

మహా జాతరకు 6 వేల బస్సులు

- మేడారం జాతరకు 30 లక్షల మందిని తరలించేలా ఏర్పాట్లు
- 18 నుంచి 25వ తేదీ వరకు బస్సు సర్వీసులు
- తల్లుల సన్నిధికొచ్చే మహిళలకు ఉచిత ప్రయాణం
- రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్
- మంత్రి సీతక్క ఆర్టీసీ ఎండీ సజ్జనార్‌తో కలిసి మేడారంలో పర్యటన
- అతివల భద్రతకు వెయ్యి మంది మహిళా పోలీసులను నియమిస్తామని వెల్లడి

ములుగు/మేడారం, ఫిబ్రవరి 5 : తెలంగాణ కుంభ మేళగా భావించే గిరిజన జాతరైన మేడారం తరలొచ్చే మహిళా భక్తులకు రాష్ట్రప్రభుత్వం మహాలక్ష్మి పథకం కింద ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణ అవకాశాన్ని కల్పిస్తోందని రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ వెల్లడించారు. సోమవారం రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, స్త్రీ శిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్క, ఆర్టీసీ ఎండీ వీసీ.సజ్జనార్‌తో కలిసి మేడారం వచ్చిన ఆయన తొలుత ములుగు సమీపంలోని గట్టమ్మ తల్లి, ఇంచర్ల ఎర్రిగట్టమ్మ దేవాలయాలను దర్శించుకున్నారు. అనంతరం మేడారం చేరుకోగా వారికి దేవాదాయ శాఖ అధికారులు ఘన స్వాగతం పలికారు. సమ్మక్క, సారలమ్మ, వనదేవతల గద్దెలను దర్శించుకున్న మంత్రులు మొక్కులు చెల్లించుకున్నారు. మంత్రి పొన్నం ప్రభాకర్ ఎత్తు బంగారం(బెల్లం) తులాభారం వేసి దేవతలకు సమర్పించారు. ఈ సందర్భంగా మేడారంలో 55 ఎకరాల్లో ఏర్పాటుచేసిన తాత్కాలిక బస్టాండు, బేస్‌క్యాంపును పరిశీలించారు. తాడ్వాయి వద్ద టికెటింగ్ పాయింట్, కామారం వద్ద ఏర్పాటుచేసిన మూడు పార్కింగ్ పాయింట్లను పరిశీలించారు. అనంతరం హరిత హోటల్‌లో అధికారులతో సమీక్షించారు.

30లక్షల మందిని జాతరకు తరలిస్తాం..

ఉచిత బస్సు ప్రయాణ పథకానికి అనూహ్య స్పందన వచ్చిందని, ఇప్పటివరకు రాష్ట్రవ్యాప్తంగా 14కోట్ల50లక్షల మంది ఆడబిడ్డలు బస్సుల్లో ఉచితంగా ప్రయాణించి గమ్యస్థానాలకు చేరారని రవాణా మంత్రి పొన్నం ప్రభాకర్ వివరించారు. ఇక ఈ సారి జాతర కోసం అత్యధికంగా 6వేల బస్సులను నడిపిస్తామని, 30లక్షల మంది భక్తులను తరలించేందుకు ఆర్టీసీ తరపున ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. మేడారం మహాజాతరను విజయవంతంగా జరిపించడంలో ఆర్టీసీది కీలక బాధ్యత అని, భక్తుల చేరవేత, రద్దీ నియంత్రణ, సదుపాయాల కల్పనపై ప్రధానంగా దృష్టిసారించామన్నారు. ఈనెల 21నుంచి 24వరకు మేడారం సమ్మక్క, సారలమ్మ మహాజాతర జరుగుతుండగా 18వ తేదీ నుంచే ప్రత్యేక బస్సు సర్వీసులను ప్రారంభించి 25వతేదీ వరకు నడిపిస్తామన్నారు. మొత్తం 51ప్రాంతాల నుంచి బస్సులు మేడారం బయలుదేరుతాయని అన్నారు. ఉమ్మడి వరంగల్, ఖమ్మం, కరీంనగర్, ఆదిలాబాద్ జిల్లాలోని ప్రతీ బస్టాండు నుంచి బస్సులు మేడారం వస్తాయని, ఈసారి ప్రభుత్వం ఆర్టీసీకి రూ.2కోట్ల 25లక్షల నిధులను మంజూరు చేసిందన్నారు. జాతర సమయంలో ఉచిత ప్రయాణ సదుపాయం కల్పిస్తుండడంతో మహిళలు ఎక్కువ సంఖ్యలో తరలివచ్చే అవకాశముందన్నారు. వీరందరికీ ఎటువంటి అసౌకర్యం కలగకుండా ఆర్టీసీ సంసిద్ధంగా ఉంటుందని వెల్లడించారు. గడిచిన వారం రోజుల్లో మేడారానికి లక్షా 10వేల మంది భక్తులు ఆర్టీసీ బస్సుల్లో వస్తే ఇందులో 70వేల మంది మహిళలే ఉన్నారని తెలిపారు. జాతర సమయంలో మేడారంలోని ఆర్టీసీ బస్టాండ్లు, టికెటింగ్ పాయింట్ల వద్ద వెయ్యిమంది మహిళా పోలీసు సిబ్బందిని నియమిస్తామని తెలిపారు. జాతర సమయంలో నార్లాపూర్ చింతల్ క్రాస్ నుంచి మేడారం గద్దెల వరకు ఉచిత సర్వీసులను నడిపిస్తా మన్నారు. క్యూలైన్‌లతోపాటు మరో 15 ఎకరాల్లో మేడారం తాత్కాలిక బస్టాండును విస్తరిస్తామని తెలిపారు. జాతర విధుల్లో పాల్గొనే సిబ్బందికి సదుపాయాలు కల్పిస్తామని చెప్పారు. ఆర్టీసీ కార్మికుల సమస్యకు జాతరకు ముందే పరిష్కారం లభిస్తుందన్నారు.



నిలువెత్తు బంగారం తూగుతున్న మంత్రి పొన్నం ప్రభాకర్, ఆర్టీసీ ఎండీ సజ్జనార్



మాట్లాడుతున్న మంత్రి పొన్నం ప్రభాకర్

భక్తుల సేవలో 15వేల మంది ఉద్యోగులు : ఆర్టీసీ ఎండీ సజ్జనార్



ఆర్టీసీ సంస్థలోని 15వేల మంది వివిధ స్థాయిల అధికారులు, సిబ్బంది జాతరకొచ్చే భక్తులకు సేవలందిస్తారని, తమ సంస్థ తరఫున జాతరను విజయవంతంగా జరిపిస్తామని ఆ సంస్థ ఎండీ వీసీ.సజ్జనార్ తెలిపారు. మేడారం జాతరను ప్రతిష్టాత్మకంగా తీసుకున్నామని, భక్తులకు ఇబ్బంది కలగకుండా చూసుకుంటామన్నారు. 2020 జాతర సమయంలో కొవిడ్ తీవ్రత కారణంగా 11లక్షల మంది మాత్రమే బస్సులలో వచ్చారని, 2022లో 22లక్షల మంది ప్రయాణించారని తెలిపారు. అప్పుడు 3,382బస్సులను నడిపించా మన్నారు. ఈ సారి అత్యధికంగా 6వేల బస్సులను నడిపిస్తున్నావని 16వ తేదీన మేడారంలోని బేస్ క్యాంపును ప్రారంభిస్తామని వెల్లడించారు. 40 ఎకరాల్లో మేడారంలో ఏర్పాటుచేసిన తాత్కాలిక బస్టాండును 55ఎకరాలకు విస్తరిస్తామన్నారు.

క్యూలైన్‌లలో ఉచితంగా తాగునీరు సరఫరా చేస్తామని తెలిపారు. వినోదం కోసం భారీ ఎల్‌ఈడీ స్క్రీన్‌లను ఏర్పాటు చేస్తామని తెలిపారు. మేడారం, పస్రా, గట్టమ్మ పాయింట్ల వద్ద ప్రత్యేక మెకానిక్ శిబిరాలు ఏర్పాటు చేస్తామన్నారు. అత్యవసర పరిస్థితులను ఎదుర్కొనేందుకు క్రేన్లు, ట్రాక్టర్‌లను అందుబాటులో ఉంచుకుంటామన్నారు. సిబ్బంది కోసం తాత్కాలిక విశ్రాంతి గదులను ఏర్పాటు చేశామన్నారు. ఈ కార్యక్రమాల్లో జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి, అదనపు కలెక్టర్ శ్రీజ, ఎస్పీ శబరీష్, ఐటీడీఏ పీవో అంకిత్, ఆర్టీసీ సీవోవో రవీందర్, ఈడీలు మునిశేఖర్, కృష్ణకాంత్, రఘునాథరావు, సీటీఎం జీవన ప్రసాద్, సీపీఎం ఉషాదేవి, వరంగల్, నల్గొండ, కరీంనగర్, ఖమ్మం, ఆదిలాబాద్, రంగారెడ్డి ఆర్ఎంలు, డీఎంలు పాల్గొన్నారు.

జాతీయ పండగగా గుర్తిస్తే మరింత అభివృద్ధి

జాతర పనులు చివరి దశలో ఉన్నాయి : మంత్రి సీతక్క

మేడారం జాతర పనులు చివరిదశకు చేరుకున్నాయని, జాతీయ రహదారి విస్తరణ, చిన్నచిన్న సీసీ రోడ్ల పనులు మినహా జాతర ఏర్పాట్లన్నీ పూర్తికావచ్చాయని మంత్రి సీతక్క అన్నారు. జాతరకు జాతీయ పండగ హోదా కల్పించాలని కేంద్ర ప్రభుత్వాన్ని కోరడం జరిగిందని, ఇటీవల రాష్ట్ర పర్యటనకు వచ్చిన రాష్ట్రపతి ద్రౌపది ముర్మకు వినతిపత్రం సమర్పించానన్నారు. జాతరకు జాతీయ పండగ హోదా వస్తే దేశవ్యాప్తంగా ప్రచారం జరిగి మేడారం ప్రాశస్త్యం అందరికీ తెలుస్తుందని, అభివృద్ధికి కేంద్ర నిధులు వస్తాయని చెప్పారు. కులమతాలు, జాతి వివక్షత లేకుండా అందరినీ కరుణించే చల్లని తల్లులు సమ్మక్క, సారలమ్మలని, తరతమ బేధం లేకుండా అందరూ ప్రకృతి దేవతలను దర్శించుకోవాలని కోరారు. రూ.105కోట్లతో భక్తులకు అన్ని సదుపా యాలు కల్పిస్తున్నామని చెప్పారు. తాగునీరు, శానిటేషన్, భద్రత, ట్రాఫిక్ ప్రధానాంశాలుగా ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. సమ్మక్క గద్దెపైకి వచ్చే రోజున 2014లో తెలంగాణరాష్ట్ర ఏర్పాటు బిల్లు పార్లమెంట్‌లో ప్రవేశపెట్టబడిందని గుర్తు చేశారు. మహాజాతర జరిగే తేదీలపై సందేహంతో ఇప్పుడే జాతర జరుగుతోందని భావించి పక్కరాష్ట్రాలకు చెందిన భక్తులు తరలివస్తున్నారని సీతక్క తెలిపారు. జాతర తేదీలపై విస్తృత ప్రచారం కల్పించాల్సి ఉందన్నారు. జాతర సమయంలో మహిళలకు ఉచిత ప్రయాణ సదుపాయం కల్పించినందుకు సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రి పొన్నం ప్రభాకర్, ఎండీ సజ్జనార్‌లకు సీతక్క కృతజ్ఞతలు తెలిపారు.



కాంగ్రెస్ ప్రభుత్వంలోనే విద్యకు పెద్దపీట

- పదేళ్లలో బీఆర్ఎస్ ఒక్క డీఎస్సీ వేయలేదు..
- ప్రభుత్వ విప్ రాంచంద్రునాయక్

మరిపెడ రూరల్, ఫిబ్రవరి 5 : కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో ఎన్నో డీఎస్సీలు నిర్వహించగా, గత బీఆర్ఎస్ ప్రభుత్వం పదేళ్ల కాలంలో ఒక్క డీఎస్సీ కూడా వేయలేదని ప్రభుత్వ విప్, డోర్నకల్ ఎమ్మెల్యే జాటోతు రాంచం ద్రునాయక్ అన్నారు. మరిపెడ మండలంలోని వీరారం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో రూ.13.50లక్షలతో సైన్స్ ల్యాబ్‌కు సోమవారం శంకుస్థాపన చేశా రు. తొలిసారి ఎమ్మెల్యే రావడంతో పాఠశాల విద్యార్థులు పూలతో ఘన స్వాగ తం పలికారు. ఆ తర్వాత జెండా పండుగ, పెద్దమ్మ తల్లి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం హైస్కూల్ హెచ్ఎం లక్ష్మీనిర్మల అధ్యక్షత న జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వ పాఠశాలల్లోనే మె రుగైన విద్య లభిస్తోందన్నారు. ప్రతీ విద్యార్థి కష్టంతో కాకుండా ఇష్టంతో చదవి శాస్త్రవేత్తలుగా ఎదగాలని ఆశించారు. ఉన్నత పాఠశాలకు రెండు ఎకరాల స్థ లాన్ని అందించిన దాత కట్కూరి నరేందర్‌రెడ్డికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపా రు. విద్య, వైద్యం బలోపేతం చేయడానికి సీఎం రేవంత్‌రెడ్డి కృషి చేస్తున్నార న్నారు. క్రీడా మైదానం బోర్డును తక్షణమే తొలగించి, పాఠశాల పేరు పెట్టాల ని హెచ్ఎంను విప్ ఆదేశించారు. రానున్న వేసవి, రబీ పంటలను దృష్టిలో పెట్టుకుని నియోజకవర్గంలోని అన్ని చెరువులను నింపాలని ఇరిగేషన్ అధికారు లను ఆదేశించారు. సమావేశంలో మాజీ ఎంపీ బలరాంనాయక్, మండల అ ధ్యక్షుడు పెండ్లి రఘువీర్‌రెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి గుగులోతు రవినాయ క్, టౌన్ అధ్యక్షుడు తాజొద్దీన్, యాదగిరి, రాములు, కొమరయ్య, మల్సూర్, బుర్ర వెంకన్న, దాసరి మునేష్, విజయ్, ఎర్పుల లింగయ్య పాల్గొన్నారు.



వీరారం ఉన్నత పాఠశాలలో మాట్లాడుతున్న ప్రభుత్వ విప్ రాంచంద్రునాయక్

ప్రభుత్వ పాఠశాలల్లోనే మెరుగైన విద్య

మరిపెడ : ప్రభుత్వ పాఠశాలల్లోనే నిరుపేద విద్యార్థులకు మెరుగైన విద్య అందుతుందని ప్రభుత్వ విప్, డోర్నకల్ ఎమ్మెల్యే జాటోత్ రాంచంద్రునాయక్ అన్నారు. సోమవారం ఆయన మరిపెడ మునిసిపల్ కేంద్రంలోని మోడల్ స్కూల్‌లో సైన్స్ ల్యాబ్ భవన నిర్మాణ పనులను ప్రారంభించి మాట్లాడారు. త్వరలో టీచర్ పోస్టులను భర్తీ చేయడానికి రాష్ట్ర ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు. విద్యార్థులు ఇష్టంతోనే చదువుకొని ఉన్నత స్థాయికి చేరాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ నాయకులు వంటికొమ్ము యుగేందర్‌రెడ్డి, మండల పార్టీ అధ్యక్షుడు పెండ్లి రఘువీర్‌రెడ్డి, కాలం రవీందర్‌రెడ్డి, పట్టణ అ ధ్యక్షుడు తాజుద్దీన్, అప్సర్, గుండగాని వేణు, డీఈ అరుణ్‌కుమార్, ప్రిన్సిపాల్ ప్రేమ్‌కుమార్, విష్ణు తదితరులు పాల్గొన్నారు. అలాగే మరిపెడలోని రాం విలాస్ గల్లీ విస్తరణ పనులను ఆయన పరిశీలించి గల్లీ వాసులతో మాట్లా డారు. రోడ్డు విస్తరణకు ప్రజలు సహకరించాలని సూచించారు.

దరఖాస్తులను తక్షణమే పరిష్కరించాలి : కలెక్టర్

మహబూబాబాద్, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): గ్రీవెన్స్‌లో వచ్చిన దరఖాస్తులను క్షుణ్ణంగా పరిశీలించి తక్షణమే పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ అద్వైత్‌కుమార్‌సింగ్ అధికారులను ఆదేశించారు. మహబూబాబాద్‌లోని కలెక్టరేట్‌లో సోమవారం గ్రీవెన్స్ సెల్‌ను నిర్వహించారు. వివిధ ప్రాంతాలకు చెందిన వారి నుంచి 135 దరఖాస్తులను స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ అద్వైత్‌కుమార్‌సింగ్ మాట్లాడుతూ... గ్రీవెన్స్‌కు వచ్చిన ఫిర్యాదులను పెండింగ్‌లో ఉంచకుండా వెంటనే పరిష్కరించాలని సూచించారు. గ్రీవెన్స్‌పై ఎంతో నమ్మకంతో ప్రజలు వస్తుంటారని తక్షణమే పరిష్కారం చూపాలని అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ లెనిన్‌వత్సవ్ టొప్పొ, జడ్పీ సీఈవో రమాదేవి, జిల్లా అధికారులు సన్యాసయ్య, సుబ్బారావు, వరలక్ష్మి, మునిసిపల్ కమిషనర్ ప్రసన్నారాణి పాల్గొన్నారు. అలాగే మహబూబాబాద్‌లో భూ కబ్జాలకు పాల్పడ్డ వారిపై చర్యలు తీసుకుని ప్రభుత్వ భూములను కాపాడాలని ఎల్‌హెచ్‌పీఎస్ జిల్లా అధ్యక్షుడు బోడ రమేష్‌నాయక్ ఫిర్యాదు చేశారు.



గ్రీవెన్స్‌లో ఫిర్యాదులను స్వీకరిస్తున్న కలెక్టర్ అద్వైత్‌కుమార్‌సింగ్

పదిలో వంద శాతం ఉత్తీర్ణత సాధించాలి

- వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక దృష్టి పెట్టాలి
- మహబూబాబాద్ ఎమ్మెల్యే భూక్య మురళీనాయక్



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే భూక్య మురళీనాయక్

మహబూబాబాద్ ఎడ్యుకేషన్, ఫిబ్రవరి 5 : పదవ తరగతి వార్షిక పరీక్షల్లో వంద శాతం ఉత్తీర్ణత సాధించేలా విద్యార్థులను సంసిద్ధులను చేయాలని మహబూబాబాద్ ఎమ్మెల్యే భూక్య మురళీనాయక్ అన్నారు. జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో మానుకోట నియోజకవర్గ స్థాయి మోడల్ స్కూల్, కేజీబీవీ, జడ్పీ, ప్రభుత్వ ఉన్నత పాఠశాలల ప్రిన్సిపాల్స్, ప్రత్యేకాధికారులు, ప్రధానోపాధ్యాయులతో పదో తరగతి ఫలితాలపై జిల్లా విద్యాశాఖాధికారి నేతృత్వంలో సోమవారం సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మురళీనాయక్ మాట్లాడుతూ... పదో తరగతి వార్షిక పరీక్షలకు హాజరయ్యే ప్రతీ విద్యార్థి ఉత్తీర్ణత సాధించే విధంగా హెచ్ఎంలు, ఉపాధ్యాయులు ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. వార్షిక పరీక్షలకు 40 రోజులు మాత్రమే ఉందని, వెనుకబడిన విద్యార్థులను గుర్తించి నియోజకవర్గంలోని ప్రతి పాఠశాలలో వంద శాతం ఉత్తీర్ణత సాధించేలా ప్రత్యేక ప్రణాళిక రూపొందించాలని సూచించారు. విద్యార్థుల ప్రత్యేక తరగతుల నిర్వహణలో ఎలాంటి నిర్లక్ష్యం వహించొద్దని, అలా జరిగితే శాఖాపరమైన చర్యలు ఉంటాయని తెలిపారు. అనంతరం ఎమ్మెల్యే మురళీనాయక్‌ను ఘనంగా సన్మానించారు. సమావేశంలో ఏసీజీఈ మందుల శ్రీరాములు, ఏఎంవో ఆజాద్ చంద్రశేఖర్, జీసీడీవో విజయకుమారి, డీఎస్‌వో అప్పారావు, ఎంఈవోలు పూల్‌చంద్, రాము, శ్రీదేవి పాల్గొన్నారు.

పట్టభద్రులు ఓటు నమోదు చేసుకోవాలి



సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే బానోత్ శంకర్‌నాయక్


- మోసపూరిత హామీలతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్‌ను నమ్మరు
- మాజీ ఎమ్మెల్యే బానోత్ శంకర్‌నాయక్

6లో..

మానుకోట సీటుకు పోటా పోటీ

ఎంపీ స్థానానికి భారీ స్థాయిలో దరఖాస్తులు

- నేడు పీఈసీ కమిటీలో పరిశీలన, వడబోతలు
- ముగ్గురు లేదా ఐదుగురి పేర్లతో సీఈసీకి నివేదిక
- ఆశావహులు.. వారి అనుచరుల్లో టెన్షన్.. టెన్షన్



మహబూబాబాద్, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో మహబూబాబాద్ ఎస్టీ రిజర్వుడ్ సీటు కోసం కాంగ్రెస్‌లో గట్టి పోటీ నెలకొంది. స్వరాష్ట్ర ఆవిర్భావం అనంతరం దశాబ్ద కాలం తర్వాత అధికారం చేపట్టిన తెలంగాణ కాంగ్రెస్‌లో మహబూబాబాద్ ఎంపీ టికెట్ దక్కించుకుంటే చాలు విజయం ఖాయమన్న సంకేతాలతో ఆశావహులు భారీ స్థాయిలో దరఖాస్తులు చేసుకున్నారు. రాష్ట్రంలో 17 సీట్లకు గాను కాంగ్రెస్ పార్టీ పోటీ చేయాలనుకుంటున్న ఆశావహుల నుంచి దరఖాస్తుల స్వీకరణ చేపట్టగా మొత్తం 306 మంది ఆయా స్థానాల కోసం పోటీ పడుతున్నారు. ఇందులో అత్యధికంగా మహబూబాబాద్ సీటును ఆశిస్తున్న వారే ఎక్కువగా ఉండడంతో అభ్యర్థి ఎంపిక ప్రదేశ్ ఎన్నికల కమిటీ (పీఈసీ)కి సవాల్‌గా మారుతోంది. దరఖాస్తుల స్వీకరణ ఈ నెల 3న ముగియగా.. మంగళవారం టీపీసీసీ ఎన్నికల కమిటీ కీలక సమావేశం నిర్వహిస్తోంది. టీపీసీసీ చీఫ్, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అధ్యక్షతన నిర్వహించే ఈ సమావేశంలో రాష్ట్ర పార్టీ వ్యవహారాల ఇన్‌చార్జి దీపామున్షీతో పాటు ఏఐసీసీ నియామకం చేసిన తెలంగాణ స్ర్కీనింగ్ కమిటీ చైర్మన్ హరీష్ చౌదరి, సభ్యులు జిగ్నేష్ మేవాని, విశ్వజిత్‌కదమ్‌లు ఎంపీ టికెట్ కోసం దరఖాస్తు చేసుకున్న వారి వివరాలు పరిశీలించనున్నారు. అభ్యర్థుల దరఖాస్తులే ప్రామాణికంగా కాకుండా దరఖాస్తు చేయని వారిలో ఆయా ఎంపీ సీట్లపై పోటీ చేస్తే గెలిచే అవకాశాలున్న వారెవరైనా ఉంటే వారి పేర్లను కూడా ఈ కమిటీ సూచి స్తుందని చెబుతున్నారు. ఇందుకోసం ఇప్పటికే కాంగ్రెస్ పార్టీ స్వీయ సర్వేలు నిర్వహించి పలువురికి సంబంధిం చిన సమాచారం తెప్పించుకున్నట్లు తెలుస్తోంది.

ఆశావహులు.. అనుచరుల్లో టెన్షన్..

మహబూబాబాద్ పార్లమెంట్ సీటు కోసం దరఖాస్తు చేసుకున్న నాయకులు, వారి అనుచరుల్లో పీఈసీ వడబోతల కీలక సమావేశంపై ఉత్కంఠత నెలకొంది. ఈ టికెట్ కోసం కేంద్ర మాజీ మంత్రి పోరిక బలరాంనాయక్ పేరు ప్రధానంగా వినిపిస్తుండగా గత అసెంబ్లీ ఎన్నికల్లో టికెట్ కోసం ప్రయత్నించి భంగపడ్డ వారిలో ఒకరిద్దరి పేర్లు కూడా పీఈసీ పరిశీలనలోకి తీసుకుంటున్నట్లు ప్రచారం జరుగుతోంది. కాంగ్రెస్ అధినేత రాహుల్‌గాంధీ భారత్ జోడో యాత్రలో ఆది నుంచి ఆఖరు వరకు పాల్గొన్న ఆదివాసీ కాంగ్రెస్ జాతీయ వైస్ చైర్మన్ తేజావత్ బెల్లయ్యనాయక్ మహబూబాబాద్ నుంచి టికెట్ ఆశిస్తుండడంతో ఆయన పేరు కూడా పీఈసీ పరిశీలనలో ఉంటుందని భావిస్తున్నారు. ఇక కొత్త వారిని రంగంలో దింపితే ఎలా ఉంటుందన్న కోణంలోనూ పీఈసీ ఆరా తీస్తున్నట్లు చెబుతున్నారు. సుదీర్ఘకాలం కిందట ఉమ్మడి వరంగల్ జిల్లాలో నాటుసారా(గుడుంబా) తయారీ, విక్రయాలను జీవనోపాధిగా తీ సుకున్న బంజారాల జీవన స్థితిపై అధ్యయనం చేసి అతిపిన్న వ యస్సులోనే వితంతువులుగా మారిన మహిళల దైన్యస్థితిని ప్రపం చానికి తెలియజేసిన పొట్టి శ్రీరాములు తెలుగు యూనివర్శిటీ రిజి స్ట్రార్ భట్టు రమేష్ దరఖాస్తు చేసుకోవడంతో పరిశీలనలో ఆయన ను కూడా ప్రాధాన్యతలోకి తీసుకునే అవకాశం లేకపోలేదని చెబు తున్నారు. అసెంబ్లీ ఎన్నికలకు ముందు కాంగ్రెస్‌లో చేరిన వీఆర్ ఎస్ రాష్ట్ర స్థాయి రిటైర్డ్ ఎక్సైజ్ అధికారి బానోత్ మోహన్‌లాల్‌తో పాటు డోర్నకల్ అసెంబ్లీ టికెట్ కోసం వరుసగా రెండుసార్లు ప్ర యత్నించి విఫలమైన మాలోతు నెహ్రూనాయక్ పేరు కూడా పరి శీలనలోకి తీసుకుంటారని ప్రచారం జరుగుతోంది. వీరితో పాటు రాజకీయ సమీకరణలు మారితే తమకు అవకాశం కల్పించాలం టూ ఎస్టీ ఉపకులాల నుంచి దరఖాస్తు చేసుకున్న రాయపురం సాంబయ్య, రిటైర్డ్ పోలీసు అధికారి ఎం.సాంబయ్య, మహిళా ప్రా తినిధ్యంలో ప్రస్తుత శాసనసభ్యుల సతీమణులు, కాంగ్రెస్‌లో కీలక పదవులు పోషించిన వారు టికెట్ కోసం ముమ్మర ప్రయత్నాలు చేస్తున్నట్లు తెలుస్తోంది.

ముగ్గురి నుంచి.. ఐదుగురి వరకు...

ప్రదేశ్ ఎన్నికల కమిటీ కీలక భేటీలో పార్లమెంట్ ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థుల దరఖాస్తుల పరిశీలన అనంతరం ముగ్గురు నుంచి ఐదుగురి పేర్లను ప్రతిపాదిస్తూ సెంట్రల్ ఎలక్షన్ కమిటీ (సీఈసీ)కి నివేదించనున్నట్లు పార్టీ వర్గాలు పేర్కొంటున్నాయి. టికెట్ కోసం దరఖాస్తు చేసుకున్న అభ్యర్థుల వివరాలు అన్ని కోణాల్లోనూ పరిశీలిస్తారని తెలుస్తోంది. ఆశావహుల బయోడేటా ఆ సాంతం చూడడంతో పాటు గతంలో కాంగ్రెస్ పార్టీలో వారి సేవలు.. పనితీరు.. పూర్వ ఎన్నికల్లో పార్టీ కోసం చేసిన కృషి. పార్టీ ఒడిదుడుకుల్లోనూ స్థిరంగా ఉండి అంకితభావంతో పనిచేసిన వారికి ప్రాధాన్యత లభిస్తుందని తెలుస్తోంది. మొత్తానికి స్ర్కీనింగ్ కమిటీ భేటీలో ప్రతిపాదించే పేర్లలో ముందుగా స్థానం సంపాదించుకోవాలని ఆశావహుల్లో గట్టి పోటీ పడుతున్న వారు ఇప్పటికే కాంగ్రెస్ టికెట్ ఖరారులో తమ పేరు ఉండేలా చూడమని పార్టీ పెద్దలు, ముఖ్యులను కలుసుకుని తమ ప్రతిపాదన వారి దృష్టిలోకి తీసుకువెళ్లినట్లు తెలుస్తోంది. ప్రధానంగా ముఖ్యమంత్రి, టీపీసీసీ చీఫ్ రేవంత్‌రెడ్డి, మహబూబాబాద్, ఖమ్మం పార్లమెంటరీ ఇన్‌చార్జి, మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డితో పాటు మాజీ పార్లమెంట్ సభ్యులు, సీనియర్ కాంగ్రెస్ నేత రామసహాయం సురేందర్‌రెడ్డి, ఏడు అసెంబ్లీ సెగ్మెంట్‌ల పరిధిలోని ఆరుగురు శాసనసభ్యులు, ఒక ఇన్‌చార్జి, ఇతర ముఖ్య నేతలను కలుసుకుని తమకు అవకాశం కల్పించాలని కోరినట్లు తెలుస్తోంది. అన్ని విధాలా ప్రయత్నాలు చేసిన ఆశావహులు చివరిగా పీఈసీ కమిటీ ప్రతిపాదనల్లో తమ పేరు దక్కించుకునేందుకు సకల శక్తులు ఒడ్డుతున్నట్లు సమాచారం.



వనదేవతలకు మొక్కులు చెల్లించుకుంటున్న భక్తులు



జంపన్నవాగులోని పుణ్యస్నానాలు చేస్తున్న భక్తులు



మేడారం పరిసరాల్లో విడిది ఏర్పాటు చేసుకుంటున్న భక్తులు

తల్లులకు ముందస్తు మొక్కులు..

మేడారానికి భారీగా తరలొస్తున్న భక్తులు

మేడారం, ఫిబ్రవరి 5 : వనదేవతలకు భక్తులు ముందస్తు మొక్కులు చెల్లించుకుంటున్నారు. తెలంగాణ కుంభమేళగా భావించే సమ్మక్కసారలమ్మ జాతరకు సమయం సమీపిస్తున్న నేపథ్యంలో రాష్ట్రంలోని పలుజిల్లాల నుంచి భారీగా జనం తరలొస్తున్నారు. ఈ క్రమంలో సోమవారం సుమారు 50వేల మంది భక్తులు వనదేవతల గద్దెలను సందర్శించారు. జంపన్నవాగులో పుణ్యస్నాలు ఆచరించి తలనీలాలు సమర్పించుకున్నారు. అనంతరం గద్దెల ప్రాంగణంలో పూలు, పండ్లు, పసుపు కుంకుమ, కొబ్బరికాయలు, నిలువెత్తు బంగారం(బెల్లం) సమర్పించారు. యాట మొక్కులతో తల్లుల గద్దెలు దద్దరిల్లేలా సమ్మక్క-సారలమ్మలకు జేజేలు పలికారు. ఇక రోజురోజుకు అమ్మవార్ల దర్శనానికి వచ్చే భక్తుల సంఖ్య పెరుగుతున్న నేపథ్యంలో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా పటిష్ఠ ఏర్పాట్లు చేస్తున్నామని దేవాదాయశాఖ అధికారులు తెలిపారు.

రేపు, ఎల్లుండి రాష్ట్ర స్థాయి రెజ్లింగ్ పోటీలు

హనుమకొండ స్పోర్ట్స్, ఫిబ్రవరి 5 : తెలంగాణ అమెచ్యూర్ రెజ్లింగ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో బుధ, గురువారాల్లో హనుమకొండ జేఎన్ ఇండోర్ స్టేడియంలో రాష్ట్ర స్థాయి రెజ్లింగ్ చాంపియన్‌షిప్ పోటీలను నిర్వహించనున్నట్లు అధ్యక్ష, కార్యదర్శులు హఫీజ్‌ఖాన్, కరీంలు ఒక ప్రకటనలో తెలిపారు. అండర్-15, 20 బాల బాలకల విభాగాల్లో పోటీలను నిర్వహించడం జరుగుతుందన్నారు. ఇక్కడ రాష్ట్ర స్థాయిలో నిర్వహించనున్న పోటీలలో అత్యుత్తమ ప్రతిభ కనబర్చిన క్రీడాకారులను ఈ నెల 11 నుంచి 17 వరకు మధ్యప్రదేశ్ రాష్ట్రంలోని గ్వాలియర్‌లో నిర్వహించనున్న జాతీయ స్థాయి రెజ్లింగ్ పోటీలకు ఎంపిక చేయడం జరుగుతుందన్నారు. ఆసక్తి, అర్హత కలిగిన క్రీడాకారులు ఈ నెల 7న ఉదయం 8 గంటలకు జేఎన్ ఇండోర్ స్టేడియంలో రిపోర్టు చేయాలని వారు సూచించారు. వివరాలకు సెల్ 81066 23230 నెంబర్‌లో సంప్రదించాలని కోరారు.

క్రీడలు స్నేహభావాన్ని పెంపొందిస్తాయి

సుబేదారి, ఫిబ్రవరి 5: క్రీడలు విద్యార్థుల మధ్య స్నేహభావాన్ని పెంపొందిస్తాయని ఎల్బీ కళాశాల ప్రిన్సిపాల్ అరుణ డీహెచ్‌రావు అన్నారు. ఎల్బీ కళాశాల వార్షిక క్రీడా దినోత్సవం, కళాశాల గోల్డెన్ జూబ్లీ సెలబ్రేషన్స్‌ను పురస్కరించుకుని సోమవారం కళాశాలలో క్రీడా పోటీలు నిర్వహించారు. క్రికెట్ ఆడి ఈ క్రీడలను ప్రిన్సిపాల్ ప్రారంభించారు. అనంతరం ప్రిన్సిపాల్ మాట్లాడుతూ విద్యార్థులకు వివిధ డిపార్ట్‌మెంట్లలో స్పోర్ట్స్ కోటా కింద ఉద్యోగాలు పొందటానికి రాష్ట్ర ప్రభుత్వం స్పోర్ట్స్ రిజర్వేషన్స్ కల్పించిందన్నారు. విద్యార్థులు కష్టపడి చదువుతూనే క్రీడల్లోనే రాణించాలన్నారు. కళాశాల ఫిజికల్ డైరెక్టర్ బి. ప్రభాకర్ మాట్లాడుతూ క్రికెట్, కబడ్డీ, ఖో-ఖో, చెస్, బ్యాడ్మింటన్, అథ్లెటిక్స్ బాస్కెట్‌బాల్ తదితర క్రీడలను బాలురకు, బాలికలకు వేరువేరుగా నిర్వహించడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ కే. రాజేందర్ రెడ్డి, గేమ్స్ కమిటీ సభ్యులు రాజేశ్వర్‌రావు, బి. శృతి, బి. రజిని పాల్గొన్నారు.

'అవకాశమిస్తే ఎమ్మెల్సీగా బరిలో ఉంటా'

హనుమకొండ టౌన్, ఫిబ్రవరి 5 : బీఆర్ఎస్ అధిష్ఠానం అవకాశం ఇస్తే పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల బరిలో నిలుస్తానని, న్యాయవాదులు ఓటు నమోదు చేసుకోవాల నివికలాంగుల కార్పొరేషన్ మాజీ చైర్మన్ కె.వాసుదేవరెడ్డి కోరారు. పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల ఓటరు నమోదులో భాగంగా సోమవారం వాసుదేవరెడ్డి జిల్లా కోర్టులో న్యాయవాదులను కలిసి ఓటు నమోదు చేసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

రెండో రోజూ బిహార్ ఎమ్మెల్యేల క్యాంపు

ఇబ్రహీంపట్నం, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): రంగారెడ్డి జిల్లా ఇబ్రహీంపట్నం సమీపంలోని కాగజ్‌గట్ సిరి నేచర్స్ వ్యాలీ రిసార్టులో.. బిహార్ రాష్ట్రానికి చెందిన కాంగ్రెస్ ఎమ్మెల్యేల క్యాంపు రెండురోజూ కొనసాగింది. స్థానిక ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి దగ్గరుండి ఏర్పాట్లను చూసుకుంటున్నారు. రిసార్టు పరిసరాలకు ఇతరులెవరూ రాకుంట కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేశారు. 12న బిహార్ అసెంబ్లీలో అక్కడి సీఎం నితీశ్ విశ్వాసపరీక్ష ఎదుర్కోనున్న నేపథ్యంలో 11వ తేదీ వరకు ఈ క్యాంపు కొనసాగనున్నట్లు తెలిసింది.

బాల్క సుమన్‌పై కేసు నమోదు

- సీఎంపై అనుచిత వ్యాఖ్యలు చేశారంటూ పోలీస్‌స్టేషన్లలో కాంగ్రెస్ ఫిర్యాదులు
- ఒళ్లు దగ్గర పెట్టుకొని మాట్లాడు: వివేక్
- స్థాయి మరిచి మాట్లాడుతున్నడు: సంపత్
- తన్ని తరిమే పరిస్థితి తెచ్చుకోవద్దు: అద్దంకి
- గుండు కొట్టి ఊరేగిస్తాం: దయాకర్ గౌడ్

దిల్‌సుఖ్‌నగర్/మంచిర్యాల/దండేపల్లి/హైదరాబాద్, జనవరి 5(ఆంధ్రజ్యోతి): సీఎం రేవంత్‌రెడ్డిపై అనుచిత వ్యాఖ్యలు చేసిన మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్‌పై కేసు నమోదైంది. బాల్క సుమన్‌పై చర్యలు తీసుకోవాలంటూ కాంగ్రెస్ నాయకుడు పూదరి తిరుపతి నేతృత్వంలో సోమవారం రాత్రి మంచిర్యాల పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ మేరకు స్పందించిన పోలీసులు.. బాల్క సుమన్‌పై 294-బి, 504, 506 సెక్షన్ల కింద కేసు నమోదు చేశారు. మరోవైపు.. హైదరాబాద్‌లోని చైతన్యపురి పోలీస్ స్టేషన్‌లోనూ రెడ్డి సంఘం కన్వీనర్ బద్దూరి వెంకటేశ్వర్‌రెడ్డి ఆయనపై ఫిర్యాదు చేశారు. రాజ్యాంగబద్ధ పదవిలో ఉన్న వ్యక్తిని కించపరిచే విధంగా వ్యాఖ్యానించారని ఫిర్యాదులో పేర్కొన్నారు. కాగా, బాల్క సుమన్ వ్యాఖ్యలపై కాంగ్రెస్ నేతలు ఫైర్ అయ్యారు. సుమన్ సంస్కారం లేకుండా మాట్లాడారని ఏఐసీసీ కార్యదర్శి సంపత్‌కుమార్ ధ్వజమెత్తారు. కేటీఆర్.. తన వెంట తిరిగే కుక్కను సీఎంపై ఉసిగొల్పాడని మండిపడ్డారు. బీఆర్‌ఎస్‌ను ప్రజలు ఇప్పటికే మడతపెట్టారన్నారు. ఓటమి మంచికేనంటూ కేటీఆర్ మాట్లాడుతున్నారని, ఆయనకు జీవితకాలం మంచే జరగాలని ఆ దేవుడిని కోరుకుంటున్నానన్నారు. బీఆర్‌ఎస్ నేతలు ఓటమి ఫ్రస్టేషన్‌లో మాట్లాడుతున్నారని, తన్ని తరిమేసే పరిస్థితి తెచ్చుకుంటున్నారని టీపీసీసీ ప్రధాన కార్యదర్శి అద్దంకి దయాకర్ అన్నారు. ఇలాంటి చిల్లరగాళ్ల మాటలను పట్టించుకోవద్దని ప్రజలకు సూచించారు. కేటీఆర్ అండ్ టీమ్.. ఒళ్లు దగ్గర పెట్టుకుని మాట్లాడాలని హెచ్చరించారు. బాల్క సుమన్ ఒళ్లు దగ్గర పెట్టుకుని మాట్లాడితే మంచిదని.. రేవంత్‌రెడ్డిపై మరోసారి అనుచిత వ్యాఖ్యలు చేస్తే గుండు కొట్టించి గాడిదపై ఊరేగిస్తామని టీపీసీసీ అధికార ప్రతినిధి చనగాని దయాకర్ హెచ్చరించారు. అమాయక విద్యార్థుల జీవితాలతో ఆడుకున్న నీచుడు బాల్క సుమన్ అంటూ టీపీసీసీ ప్రధాన కార్యదర్శి చారుగొండ వెంకటేష్ అన్నారు. తెలంగాణ ఉద్యమంలో శ్రీకాంతా చారి, వేణుగోపాల్‌రెడ్డి చావుకు ఆయనే కారణమన్నారు. టీపీసీసీ ప్రధాన కార్యదర్శి పున్నా కైలాశ్ నేత మాట్లాడుతూ సీఎం రేవంత్‌కు బాల్క సుమన్ చెప్పు చూపిస్తే.. తెలంగాణ ప్రజలు ఆయన్ను బట్టలూడదీసి కొడతారన్నారు. కాగా, ముఖ్యమంత్రి రేవంత్‌పై అనుచిత వ్యాఖ్యలు చేసిన బాల్క సుమన్ ఒళ్లు దగ్గర పెట్టుకోవాలని చెన్నూరు ఎమ్మెల్యే గడ్డం వివేక్ సూచించారు. దిగజారి మాట్లాడటం సరైందికాదని హితవు పలికారు. మంచిర్యాల జిల్లా దండేపల్లిలో బాల్క సుమన్ దిష్టిబొమ్మతో ర్యాలీ నిర్వహించి, దహనం చేశారు. అలాగే, చెన్నూరు పట్టణంలో మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్ చిత్రపటానికి కాంగ్రెస్ నాయకులు చెప్పుల దండ వేసి నిరసన తెలిపారు.

రేవంత్ జూటా సీఎం

(మొదటిపేజీ తరువాయి)

సమావేశంలో రాష్ట్ర అధికారులే చెప్పారు. అదే విషయాన్ని ఈఎన్‌సీ ప్రకటించారు. నెల రోజుల్లో ప్రాజెక్టులను అప్పగించాలని, సీఆర్పీఎఫ్ అనుమతితోనే ప్రాజెక్టుల వద్దకు ఇంజినీర్లు వెళ్లాలని, నిర్వహణ బాధ్యత రెండు రాష్ట్రాలదని పేర్కొంటూ ఆ తర్వాత కేంద్రం వెల్లడించిన మినిట్స్‌లోనూ ఉంది. దీనిపై 19న నేను ప్రెస్‌మీట్ పెట్టి ప్రశ్నించే వరకూ మంత్రులకు సోయి లేదు. ప్రాజెక్టులను అప్పగిస్తే రాష్ట్రానికి నష్టం కలుగుతుందని.. అప్పుడు గుర్తించారు. పదేళ్లలో కేఆర్ఎంబీకి తాము ఏ ప్రాజెక్టునూ అప్పగించలేదు. కానీ, కాంగ్రెస్ ప్రభుత్వం రెండు నెలల్లోనే ప్రాజెక్టులను ఢిల్లీ చేతిలో పెట్టి అడుక్కు తినే పని చేశారు"అని విమర్శించారు. ఇదంతా నిజం కాకుంటే ఉద్యోగులు, వారి జీతాల చెల్లింపు వరకు చర్చ ఎందుకు వచ్చిందో చెప్పాలని డిమాండ్ చేశారు. కేఆర్ఎంబీకి చెందిన 16, 17వ సమావేశాల్లో తెలంగాణ ఒప్పుకోలేదని మినిట్స్ కాపీలోనే ఉందంటూ.. అందులోని అంశాలను చదివి వినిపించారు. ఆ సమావేశానికి హాజరు కాని అప్పటి సీఎం కేసీఆర్ స్వయంగా ఎలా సంతకాలు చేస్తారని ప్రశ్నించారు. తప్పును ఒప్పుకోకుండా.. గత ప్రభుత్వమే ఒప్పుకొందంటూ అబద్ధాలు చెబుతున్నారని.. ఇంతకన్నా జూటా సీఎం ఎవరైనా ఉంటారా? అని ప్రశ్నించారు. సీఎం రేవంత్‌కు స్క్రిప్ట్ రాసిస్తున్న వారు అబద్ధాలనే రాసిస్తున్నారని, ఆయన్ను తప్పుదోవ పట్టించకుండా సరైన సమాచారం ఇస్తే బాగుటుందని ఎద్దేవా చేశారు. ప్రాజెక్టులను బోర్డుకు అప్పగించి రాష్ట్ర ప్రజల భవిష్యత్తును తాకట్టు పెట్టొద్దని కోరారు. రేవంత్ అబద్ధాలకు తాను ఇస్తున్న వివరణ శాంపిల్ మాత్రమేనని, అసెంబ్లీ వేదికగా ప్రజలకు వాస్తవాలు చెబుతామని, పూర్తి సినిమా ముందుందన్నారు. కాంగ్రెస్ నేతలు కూడా ప్రిపేర్ అయి రావాలని, గతంలో మాదిరిగా అడ్డంగా దొరికిపోయే పరిస్థితి తెచ్చుకోవద్దని సూచించారు.



రాయలసీమ లిఫ్ట్‌ను వ్యతిరేకించాం

పోతిరెడ్డిపాడు విషయంలో పదవులకు ఆశపడి పెదవులు మూసుకున్నారంటూ రేవంత్ చేసిన ఆరోపణల్లో వాస్తవం లేదని హరీశ్ స్పష్టం చేశారు. 2005 జూలై 4న తాము మంత్రి పదవులకు రాజీనామా చేసి కాంగ్రెస్ సర్కారు నుంచి బయటకు వచ్చామని, అదే ఏడాది సెప్టెంబర్ 13న అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం పోతిరెడ్డిపాడుపై జీవో తెచ్చిందన్నారు. పదవుల కోసం పార్టీలు మారిన చరిత్ర రేవంత్‌దని, ఉల్టా చోర్ కొత్వాల్ కే డాంటే లాగా తమపై నిందలు వేయడం తగదన్నారు. రాయలసీమ లిఫ్ట్‌ను కేసీఆర్ వ్యతిరేకించారని, రెండో అపెక్స్ కమిటీ మీటింగ్‌లోనూ ఈ అంశాన్ని ప్రస్తావించారని గుర్తు చేశారు. ప్రాజెక్టులు ఇచ్చింది ఎవరు.. ఎవర్ని చెప్పులతో కొట్టాలో రేవంత్ రెడ్డి సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. నాడు కేంద్రంలో అధికారంలో ఉన్న కాంగ్రెస్ పెద్దలే విభజన చట్టం రూపొందించారని, బిల్లులోని అంశాల గురించి తెలుసుకోకుండా వితండవాదం చేయడం తగదన్నారు. మితిమీరిన అహంకారం, అబద్ధాలు, సంస్కారం లేని భాష, వికారమైన ధోరణి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిలో కనిపించాయని హరీశ్ ధ్వజమెత్తారు. కేసీఆర్ పట్ల నీచమైన భాషలో దూషణలకు పాల్పడ్డారన్నారు. ఆయన ధోరణి చూసి ఒక సీఎం ఇలా మాట్లాడతారా? అని తెలంగాణ ప్రజలు అసహ్యించుకుంటున్నారని పేర్కొన్నారు. కాగా, ఉమ్మడి రాష్ట్రంలోనే నీళ్లు బాగుండేవని, తెలంగాణ వచ్చాక అన్యాయం జరిగిందని మంత్రి ఉత్తమ్ చేసిన వ్యాఖ్యలు అమరుల త్యాగాలను తప్పుపట్టేలా ఉన్నాయని హరీశ్ ఆరోపించారు. నాడు కాంగ్రెస్ పాలనలో జరిగిన అన్యాయాలను తమ ప్రభుత్వం సరి చేసిందని పేర్కొన్నారు.

చెత్త సీఎంను చెప్పుతో కొడతా

- మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్
- చెప్పు చూపిస్తూ పరుష పదజాలంతో దూషణ
- మాకూ ముతక కూతలు వస్తాయి: జగదీశ్‌రెడ్డి, ప్రశాంత్‌రెడ్డి

(ఆంధ్రజ్యోతి న్యూస్ నెట్‌వర్క్)

రండ పనులు చేసింది మీరు.. అంటూ కేసీఆర్‌ను ఉద్దేశించి సీఎం రేవంత్‌రెడ్డి చేసిన వ్యాఖ్యలపై బీఆర్‌ఎస్ నేతలు ఘాటుగా స్పందించారు. రేవంత్‌ను ఉద్దేశించి ప్రచురించలేని భాషలో దుర్భాషలాడారు. మాజీ మంత్రులు, మాజీ ఎమ్మెల్యేలు పరుష పదజాలంతో దూషించారు. చెత్త సీఎం రేవంత్‌ను చెప్పుతో కొడతానంటూ మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్ వివాదాస్పద వ్యాఖ్యలు చేశారు. చెప్పు చూపిస్తూ తీవ్ర పదజాలంతో దుర్భాషలాడారు. మంచిర్యాల, పెద్దపల్లిలో ఆయన మాట్లాడారు. "కాలం కలిసొచ్చి అందలమెక్కావ్.. నీ అదృష్టమో, తెలంగాణ ప్రజల దురదృష్టమో ముఖ్యమంత్రి కుర్చీలో కూర్చున్నవ్. గతంలో చిల్లర మాటలు మాట్లాడిన నువ్వు.. ఇప్పుడు ముఖ్యమంత్రి స్థాయిలో పద్ధతిగా మాట్లాడాలె. పదేళ్ల పాటు తెలంగాణను బ్రహ్మాండంగా అభివృద్ధి చేసిన నాయకుడు కేసీఆర్‌ను తిడితే ఊరుకోం.. చెప్పుదీసి కొడుతా.. ఖబడ్దార్" అని వ్యాఖ్యానించారు. కాంగ్రెస్ పార్టీలో పది మంది ముఖ్యమంత్రులు ఉన్నారని, ఎప్పుడు ఎవడు కుర్చీ లాగుతాడో, ఎవరు అంగీ లాగు లాగుతాడో తెలియని పరిస్థితి ఉందన్నారు. అదానీని రాహుల్ గాంధీ విమర్శిస్తే, రేవంత్ రెడ్డి దావోస్ వెళ్లి రూ.12 వేల కోట్ల పెట్టుబడులకు ఎలా అంగీకరించారని ప్రశ్నించారు. ఇప్పటిదాకా రైతు బంధు డబ్బులు వేయని ప్రభుత్వం.. కాంట్రాక్టర్లకు బిల్లులు మాత్రం చెల్లించిందని మండిపడ్డారు. మంత్రి శ్రీనివాస్‌రెడ్డికి చెందిన రాఘవ కన్‌స్ట్రక్షన్స్‌కు సైతం పెద్ద మొత్తంలో బిల్లులు చెల్లించారన్నారు. నల్లగొండ జిల్లా మిర్యాల గూడలో మాజీ మంత్రులు జగదీశ్ రెడ్డి, వేముల ప్రశాంత్‌రెడ్డి మాట్లాడుతూ హామీలు అమలు చేయలేని రేవంత్‌రెడ్డి.. కేసీఆర్‌పై నెపం వేసి తప్పించుకోవాలని చూస్తున్నారని విమర్శించారు. 100 రోజుల్లో ఆరు గ్యారెంటీలను అమలు చేయకపోతే కాంగ్రెస్ నాయకులను ప్రజలే వెంటబడి చెప్పులతో కొడతారన్నారు. నిండా మూడు ఫీట్లు లేని సీఎం.. ఎమ్మెల్యే కంటే హీనంగా మాట్లాడుతున్నారన్నారు. తిట్టదలుచుకుంటే.. తమకూ మరిన్ని ముతక కూతలు వస్తాయని హెచ్చరించారు. అసెంబ్లీ ఎన్నికల సమయంలో నాగార్జున సాగర్ ప్రాజెక్టుపైకి ఏపీ పోలీసులు దండెత్తి వచ్చారని, కోడ్ అమలులో ఉండడంతో అప్పటి సీఎం కేసీఆర్ అధికారులకు ఆదేశాలు ఇవ్వలేకపోయారని తెలిపారు. యాదగిరిగుట్టలో ఎమ్మెల్యే కడియం శ్రీహరి మాట్లాడుతూ రేవంత్‌రెడ్డి సీఎం అనే విషయాన్ని మరిచిపోయారని, ఇంకా టీపీసీసీ అధ్యక్షుడిలాగే వ్యవహరిస్తునానరని ఎమ్మెల్యే కడియం శ్రీహరి విమర్శించారు. "ప్రభుత్వ అసమర్థతను, చేతగానితనాన్ని ప్రశ్నిస్తే వంద గజాల లోతున బీఆర్‌ఎస్‌ను బొంద పెడతావా? బీఆర్‌ఎస్‌ను బొంద పెట్టేటోళ్లు.. ఇకపైనా పుట్టబోరు. కేసీఆర్‌నే అసభ్య పదజాలంతో దూషిస్తావా.. బుద్ధి ఉందా నీకు" అని నిలదీశారు. రేవంత్ మాట తీరు ఇలాగే ఉంటే తెలంగాణ ప్రజలు ఆయనకు ఘోరీ కట్టడం ఖాయమన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన కొన్ని రోజుల్లోనే ప్రాజెక్టుల అప్పగింతకు ఒప్పందం చేసుకున్నారని, వచ్చే ఐదేళ్లలో తెలంగాణను ఏపీలో కలిపినా కలిపేస్తారని మాజీ మంత్రి నిరంజన్‌రెడ్డి విమర్శించారు. పెద్దపల్లిలో ఆయన మాట్లాడుతూ శ్రీశైలం, నాగార్జున సాగర్ ప్రాజెక్టులను కేఆర్ఎంబీకి అప్పగించేందుకు బీఆర్‌ఎస్ ప్రభుత్వం ఒప్పుకోలేదని స్పష్టం చేశారు.





నేడు తెలంగాణభవన్‌కు
మాజీ సీఎం కేసీఆర్

- కృష్ణానది పరివాహక జిల్లాల నేతలతో సమావేశం
- కేఆర్ఎంబీకి ప్రాజెక్టులను అప్పగించడంపై చర్చ

హైదరాబాద్, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): అసెంబ్లీ ఎన్నికల ముందు పార్టీ కార్యాలయానికి వచ్చిన బీఆర్‌ఎస్ అధినేత కె.చంద్రశేఖర్‌రావు.. ఫలితాల వెల్లడి తర్వాత తొలిసారి మంగళవారం రానున్నారు. ఎర్రవెల్లి వ్యవసాయ క్షేత్రంలో కాలు జారడంతో ఆయనకు తుంటి శస్త్రచికిత్స చేసిన విషయం విదితమే. దాన్నుంచి కోలుకున్న కేసీఆర్.. ఈ నెల 2న గజ్వేల్ ఎమ్మెల్యేగా ప్రమాణ స్వీకారం చేశారు. అదేరోజు నందినగర్‌లోని తన నివాసంలో పార్టీ నేతలతో సమావేశమయ్యారు. మంగళవారం తెలంగాణ భవన్‌కు రానున్నారు. ఈ సందర్భంగా కృష్ణానది పరివాహక జిల్లాలకు చెందిన వారితోపాటు బీఆర్‌ఎస్ పార్టీ ముఖ్య నేతలతో కేసీఆర్ సమావేశమవుతారు. నాగార్జున సాగర్, శ్రీశైలం సహా కృష్ణానది మీద ఉన్న ప్రాజెక్టులను కేంద్రానికి అప్పగించడాన్ని ఖండిస్తూ.. కాంగ్రెస్ ప్రభుత్వం తీసుకున్న రైతు వ్యతిరేక నిర్ణయాలను ప్రజల్లో ఎండగట్టేందుకు ఏం చేయాలన్న దానిపై ఆయన చర్చిస్తారు. అంతేకాకుండా కేఆర్ఎంబీ పరిధిలోకి ప్రాజెక్టులను తీసుకువెళ్లడాన్ని నిరసిస్తూ.. త్వరలోనే నల్గొండలో చేపట్టనున్న భారీ బహిరంగ సభకు ఏర్పాట్లు, ఇతర కార్యాచరణపై పార్టీ నేతలకు కేసీఆర్ దిశానిర్దేశం చేయనున్నారు.

నేడు మేడిగడ్డను సందర్శించనున్న
కర్ణాటక ఎమ్మెల్యేలు!

మహదేవపూర్ రూరల్, ఫిబ్రవరి 5 : కర్ణాటక అసెంబ్లీ స్పీకర్‌తో పాటు 11మంది ఎమ్మెల్యేల బృందం నేడు మేడిగడ్డ బ్యారేజీని సందర్శించనున్నట్లు తెలిసింది. ఈ మేరకు విశ్వసనీయవర్గాల ద్వారా సమాచారం అందింది. తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన అనంతరం కాళేశ్వరం ప్రాజెక్టులో జరిగిన అవినీతిపై విచారణ చేపట్టిన సంగతి తెలిసిందే. విచారణలో భాగంగానే మేడిగడ్డ బ్యారేజీతో పాటు కన్నెపల్లి పంప్‌హౌస్, మహదేవపూర్ ఇరిగేషన్ సబ్ డివిజన్ కార్యాలయాల్లోనూ ఇప్పటికే రెండు విడతలుగా విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ శాఖ తనిఖీలు నిర్వహించింది. కాగా, విజిలెన్స్ ఇంకా ప్రభుత్వానికి నివేదిక అందించకముందే కర్ణాటక స్పీకర్, ఎమ్మెల్యేలు మేడిగడ్డ బ్యారేజీ సందర్శనకు రానుండడం చర్చనీయాంశంగా మారింది.

కేసీఆర్, జగన్ కుట్రతోనే
సాగర్ ఆక్రమణ

పోలింగ్‌ను ప్రభావితం చేసే కుట్ర దాగుంది..కృష్ణా ప్రాజెక్టుల్ని బోర్డుకు అప్పగించే ప్రసక్తేలేదు: ఉత్తమ్

హైదరాబాద్, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ అసెంబ్లీ ఎన్నికలను ప్రభావితం చేయాలన్న కేసీఆర్-జగన్ కుట్రలో భాగంగానే.. తెలంగాణలో పోలింగ్ రోజున నాగార్జున సాగర్ డ్యామ్‌ను ఏపీ పోలీసులు ఆక్రమించారని రాష్ట్ర నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి ఆరోపించారు. జగన్, కేసీఆర్ మాట్లాడుకున్నాకే.. ఎన్నికల్లో కేసీఆర్‌కు రాజకీయ ప్రయోజనం కల్పించడానికే గత ఏడాది నవంబరు 29న సాగర్ ఆక్రమణ జరిగిందని ఆయన ఆక్షేపించారు. సచివాలయంలో సోమవారం విలేకరులతో మాట్లాడిన మంత్రి.. కృష్ణా ప్రాజెక్టులను బోర్డుకు అప్పగించబోమని, అలాంటి ఆలోచనే లేదని తేల్చిచెప్పారు. హరీశ్‌రావులాగా పెట్రోల్ పోసుకొని నాటకాలాడి.. ఇంకొకరి ఆత్మహత్యకు తామెప్పుడూ కారణం కాలేదని స్పష్టంచేశారు. "మీరు ఉద్యమ సమయంలోనే బ్లాక్‌మెయిలర్లు. ఆ లెక్కలు బయటపెట్టాలా?" అన హరీశ్‌రావును ఉద్దేశించి మంత్రి నిప్పులు చెరిగారు. తెలంగాణ రావడానికి నాడు కేంద్ర హోం మంత్రిగా చిదంబరం నిర్వహించిన అఖిలపక్ష సమావేశమే కారణమని, ఆ భేటీ అనంతరం కేంద్రాన్ని ఒప్పించి, తెలంగాణ ఏర్పడటానికి చిదంబరం చేసిన ప్రయత్నాలు కీలకమని గుర్తుచేశారు. "ఈ విషయం నీకు (హరీశ్‌రావు) తెలియకుంటే.. నీ మామను అడుగు" అని మండిపడ్డారు. ఉమ్మడి రాష్ట్రంలో కన్నా తెలంగాణ ఏర్పడ్డాక, టీఆర్‌ఎస్ పాలనలోనే తెలంగాణకు కృష్ణా జలాల విషయంలో అన్యాయం జరిగిందని మంత్రి ధ్వజమెత్తారు. సాగర్, శ్రీశైలం ప్రాజెక్టులను అప్పగించడానికి తమకు ఎలాంటి అభ్యంతరాలూ లేవని 16వ కృష్ణాబోర్డు సమావేశంలో చెప్పింది టీఆర్‌ఎస్ ప్రభుత్వమేనని.. తెలంగాణ ప్రజల ప్రయోజనాలను దెబ్బతీసే నిర్ణయాలన్నీ టీఆర్‌ఎస్ ఒప్పందం చేసుకుందని, రైతాంగానికి, ప్రజలకు అన్యాయం చేసిందే టీఆర్‌ఎస్ అని మంత్రి దుయ్యబట్టారు. ఉమ్మడి ఏపీకి బచావత్ ట్రైబ్యునల్ 811 టీఎంసీల కృష్ణా జలాలను కేటాయించగా.. అందులో ఏపీకి 66 శాతం(512 టీఎంసీలు), తెలంగాణకు 34 శాతం(299 టీఎంసీలు) కేటాయింపుపై 2015లో టీఆర్‌ఎస్ ప్రభుత్వమే ఒప్పందం చేసుకుందని, ఆ అన్యాయం పదేపదే కొనసాగిందని మండిపడ్డారు. 2023-24 బడ్జెట్ డిమాండ్ బుక్‌లో తెలంగాణ పాలసీ ప్రకటనలో భాగంగా శ్రీశైలం, నాగార్జునసాగర్‌ను కృష్ణాబోర్డుకు, పెద్దవాగు ప్రాజెక్టును గోదావరి బోర్డుకు అప్పగించడానికి నిర్ణయం తీసుకున్నట్లు శాసనసభలో ప్రకటించిందని గుర్తుచేశారు. అంతేకాక.. ఆయా ప్రాజెక్టుల నిర్వహణ కోసం సీడ్ మనీ కింద బోర్డులకు చెరో రూ.200 కోట్లను ఇవ్వాలనే నిర్ణయం తీసుకున్నట్లు ప్రకటించిందని.. ఇప్పుడు అబద్ధాలతో ప్రజలను మోసం చేస్తోందని ఆక్షేపించారు. తాము మంత్రులుగా ప్రమాణస్వీకారం చేసి 56 రోజులైందని.. ఈ 56 రోజుల్లో ప్రాజెక్టుల అప్పగింతపై ఎలాంటి నిర్ణయమూ తీసుకోలేదని స్పష్టం చేశారు. నీటిపారుదల శాఖపై శ్వేతపత్రం విడుదల చేయడంతో పాటు అన్ని అంశాలపై చర్చకు సిద్ధంగా ఉన్నామన్నారు.



కేసీఆర్ సీఎంగా ఉన్నప్పుడు జగన్‌తో జరిపిన ఏకాంత చర్చల తర్వాతే.. శ్రీశైలం నుంచి రోజూ 8 టీఎంసీల తరలింపుపై రాయలసీమ ఎత్తిపోతల పథకం జీవో విడుదలయిందని ఉత్తమ్ గుర్తుచేశారు. అపెక్స్ కౌన్సిల్ సమావేశానికి హాజరు

ఏకాంత చర్చల ఫలితమే..

కాకుండా.. రాయలసీమ టెండర్లు ఖరారయ్యాకే కేసీఆర్ అపెక్స్ కౌన్సిల్‌కు వెళ్లారని ఆగ్రహం వ్యక్తం చేశారు. అలాగే.. పదేళ్ల అధికారంలో ఉన్నప్పటికీ కృష్ణా బేసిన్‌లోని పెండింగ్ ప్రాజెక్టులను పూర్తి చేయలేదని, పాలమూరు-రంగారెడ్డి నిర్మాణ అంచనాలు పెంచుకుంటూ పోయారని, ఈ ప్రాజెక్టులో రూ.27500 కోట్లు ఖర్చుపెట్టినా ఒక్క ఎకరాకు నీళ్లివ్వలేదని నిప్పులు చెరిగారు. కల్వకుర్తి, బీమా, నెట్టెంపాడు, కోయిల్‌సాగర్‌తో పాటు శ్రీశైలం లెఫ్ట్ బ్యాంక్ కెనాల్ (ఎస్‌ఎల్‌బీసీ) టన్నెల్ ప్రాజెక్టులను కూడా పూర్తిచేయలేదని ఉత్తమ్ మండిపడ్డారు.

ఆర్టీసీ ఆదాయానికి గండి!

కొన్నేళ్లుగా పేరుకుపోయిన లీజు బకాయిలు

- ఏటా రావాల్సింది 100కోట్లపైనే
- సగం కూడా వసూలు చేయని పరిస్థితి
- బీఆర్ఎస్ హయాంలో ఒత్తిళ్లే కారణం
- కాంగ్రెస్ వచ్చాక లీజుదారులకు నోటీసులు
- లీజులు రద్దు, స్థలాల స్వాధీనానికి యత్నం

హైదరాబాద్, ఫిబ్రవరి 5(ఆంధ్రజ్యోతి): బీఆర్‌ఎస్ పాలకుల నిర్లక్ష్యానికితోడు రాజకీయ ఒత్తిళ్ల కారణంగా ఆర్టీసీ ఆదాయానికి భారీగా గండి పడింది. లీజు బకాయిల వసూళ్లు చేపట్టకుండా అధికారులను నియంత్రించడంతో ఆర్టీసీ ఖజానాకు రావాల్సిన కోట్లాది రూపాయల నిధులు నిలిచిపోయాయి. టికెట్ చార్జీల చెల్లింపుల్లో కేవలం రూ.10 వ్యత్యాసం వస్తేనే కండక్టర్లను సస్పెండ్ చేసే యాజమాన్యం.. లీజుదారుల నుంచి కోట్లాది రూపాయలు వసూలు చేయకుండా ఏళ్ల తరబడి నుంచి చోద్యం చూడడంలో అంతర్యమేమిటన్న ప్రశ్నలు తలెత్తుతున్నాయి. ఆర్టీసీ బస్టాండ్లలోని స్టాళ్లను అద్దెకు ఇవ్వడం, స్థలాలను లీజుకు ఇవ్వడం ద్వారా ఆర్టీసీకి ఏటా 100 కోట్లకు పైగా ఆదాయం వస్తోంది. కానీ, గత బీఆర్‌ఎస్ పాలకుల నిర్లక్ష్య ధోరణి... కారణంగా సగానికిపైగా ఆదాయం నిలిచిపోయినట్లు తెలిసింది.

కొన్ని ఉదాహరణలు..

గ్రేటర్ హైదరాబాద్ రీజియన్‌లో సిటీ బస్సుల్లో వాణిజ్య ప్రకటనల కోసం ఆర్టీసీతో గో రూరల్ ఇండియా సంస్థ ఒప్పందం కుదుర్చుకుంది. 2015 సెప్టెంబరు నుంచి 2021 సెప్టెంబరు వరకు రూ.22కోట్లు చెల్లించాలి. కానీ, గడువులోగా బకాయిలను వసూలు చేయడంలో ఆర్టీసీ అధికారులు విఫలమయ్యారనే ఆరోపణలున్నాయి. హైదరాబాద్ రీజియన్‌కు రూ.10.75 కోట్లు, సికింద్రాబాద్ రీజియన్‌కు రూ.10.98 కోట్లు బకాయిలు పేరుకుపోయాయి. గడువులోగా చెల్లించని పక్షంలో ఒప్పందాన్ని రద్దు చేసుకునే అవకాశం ఉన్నప్పటికీ ఆర్టీసీ అధికారులు చర్యలు తీసుకోకుండా అప్పటి అధికారపార్టీ నేతలు అడ్డుపడినట్టు తెలిసింది. ఇక, ఎంజీబీఎస్‌లో స్టాళ్ల కేటాయింపులో సైతం అవకతవకలు జరిగినట్టు ఫిర్యాదులున్నాయి. ఆర్టీసీ కళామండపం లీజు విషయంలోనూ ఇదే తంతు చోటు చేసుకుంది. ఏళ్ల తరబడి నిర్వహణ బాధ్యతలు పొందిన అధికార పార్టీ నేతలు సుమారు రూ.8కోట్లకుపైగా ఎగవేసినట్టు అధికారులు తెలిపారు. ఇక, నిజామాబాద్‌లో ఆర్టీసీ స్థలాన్ని లీజుకు తీసుకుని వాణిజ్య సముదాయాన్ని నిర్మించి, అద్దెకు ఇచ్చి ఆదాయం పొందుతున్న రాజకీయ నాయకుడిపై చర్యలు తీసుకోవడంలో ఆర్టీసీ విఫలమైందన్న ఆరోపణలున్నాయి. కరీంనగర్, నల్లగొండ, రాణిగంజ్, మియాపూర్, దిల్‌సుఖ్‌నగర్ ప్రాంతాల్లోని స్థలాలు, భవనాల లీజుదారుల నుంచి భారీ మొత్తంలో బకాయిలు రావాల్సి ఉన్నట్లు అధికార వర్గాలు పేర్కొంటున్నాయి. తాజాగా బీఆర్‌ఎస్ గద్దె దిగి కాంగ్రెస్ అధికారంలోకి రావడంతో ఆర్టీసీ అధికారులు రంగంలోకి దిగారు. బకాయిల వసూళ్ల కోసం లీజుదారులకు నోటీసులు జారీ చేస్తున్నారు. లీజుదారులు స్పందించని పక్షంలో ఒప్పందాలను రద్దు చేసి, స్థలాలు, నిర్మాణాలను తిరిగి స్వాధీనం చేసుకునేందుకు ప్రయత్నిస్తున్నారు.

డబ్బులు ఇవ్వకపోతే కేసులు పెట్టండి

అధికారులను ఆదేశించిన విప్ రాంచంద్రునాయక్



సమావేశంలో మాట్లాడుతున్న ప్రభుత్వ విప్ రాంచంద్రునాయక్

చిన్నగూడూరు, ఫిబ్రవరి 5 : డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల మాంజూరు కోసం దళారులకు ఇచ్చిన డబ్బులు వసూలు చేసుకోండి.. ఇవ్వకపోతే వారిపై కేసులు పెట్టండని ప్రభుత్వ విప్, డోర్నకల్ ఎమ్మెల్యే రాంచంద్రునాయక్ అన్నారు. చిన్నగూడూరు మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో సోమవారం సర్వసభ్య సమావేశాన్ని ఎంపీపీ పద్మ అధ్యక్షతన నిర్వహించగా, ఆయన హాజరై మాట్లాడారు. 'డబ్బులు పాయే.. ఇల్లు రాకపాయే' అనే శీర్షికతో ఆంధ్రజ్యోతిలో వెలువడిన కథనానికి ఎమ్మెల్యే స్పందించారు. డబుల్ బెడ్ రూమ్ ఇళ్ల వ్యవహారంలో అవినీతి జరిగిందని తన దృష్టికి వచ్చిందని అన్నారు. వసూలు చేసిన వారు మర్యాదగా డబ్బులు తిరిగి ఇచ్చేయండని, లేని యెడల కేసులు ఫైల్ చేయండని అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. వేసవి కాలం దృష్ట్యా మంచినీటి సమస్యలపై దృష్టి సారించాలని సూచించారు. ఆయా శాఖల అధికారులు తమ ప్రగతి నివేదిక చదివి వినిపించారు. అనంతరం తెలంగాణ కల్లుగీత కార్మిక సంఘం క్యాలెండర్‌ను ఆసంఘం బాధ్యులతో కలిసి ఎమ్మెల్యే ఆవిష్కరించారు. సమావేశంలో ఎంపీడీవో శ్యాంసుందర్, తహసీల్దార్ మహబూబ్‌ఆలీ, కమలాకర్, మోహన్, వెంకన్న, గాడిపెల్లి శ్రీశైలం, నాగేష్, వెంకటేశ్వర్లు, శ్రీనివాస్, కొమురెల్లి, అధికారులు పాల్గొన్నారు.

మత్స్యకారుల సమస్యలను పరిష్కరించాలి

డోర్నకల్, ఫిబ్రవరి 5: మత్స్యకారుల సమస్యలను ప్రభుత్వం తక్షణమే పరిష్కరించాలని సంఘం అధ్యక్షుడు కూనరపు శంకర్ డిమాండ్ చేశారు. డోర్నకల్ మత్స్య పారిశ్రామిక సహకార సంఘం సమావేశాన్ని సోమవారం పట్టణంలోని స్థానిక బతుకమ్మ చెరువు వద్ద నిర్వహించారు. ఈసందర్భంగా శంకర్ మాట్లాడుతూ... ఈ ఏడాది మత్స్య పారిశ్రామిక సహకార సంఘంలో 85 మందిని సభ్యులుగా తీసుకున్నట్లు ప్రకటించారు. అనంతరం నూతన సభ్యులతో ప్రమాణస్వీకారం చేయించారు. మత్స్యకారుల సమస్యలను ప్రభుత్వం పరిష్కరించాలని కోరారు. మత్స్యకార కుటుంబాలకు ఉచితంగా వాహనాలను అందించాలన్నారు. ఈ సమావేశంలో ఉపాధ్యక్షుడు కూనపు శివ, కార్యదర్శి గుంటి కొమురయ్య, మారబోయిన రాంభద్రం, ఎరువ ఎల్లయ్య, మామిడి రామ్మూర్తి, మామిడి నాగరాజు, సాంబయ్య పాల్గొన్నారు.

వాణిజ్య లైసెన్సులపై డీఎల్‌పీవో తనిఖీలు

లేని షాపులకు తాళం వేయడంతో వివాదం

కేసముద్రం, ఫిబ్రవరి 5 : కేసముద్రం స్టేషన్ గ్రామపంచాయతీ పరిధిలోని షాపులకు జీపీ నుంచి వాణిజ్య లైసెన్సులపై సోమవారం డీఎల్‌పీవో గంగాభవాని తనిఖీలు నిర్వహించారు. మార్కెట్ రోడ్‌లో లైసెన్సు తీసుకోని పలు షాపులకు తాళం వేయించారు. తాళం వేయిస్తున్న క్రమంలో పలువురు షాపుల యజమానులు, డీఎల్‌పీవోతో వాగ్వాదానికి దిగారు. నోటీసులు ఇవ్వకుండా అకస్మాత్తుగా తమ షాపులకు తాళాలు వేయడం ఏమిటని ప్రశ్నించారు. దీంతో షాపుల యజమానులు అంతా గుమికూడి ధర్నాకు సిద్ధమవుతున్న క్రమంలో అక్కడికి డీసీసీ ఉపాధ్యక్షుడు అంబటి మహేందర్ రెడ్డి చేరుకొని ఎమ్మెల్యే మురళీనాయక్‌తో డీఎల్‌పీవోకు ఫోన్ చేయించారు. వ్యాపారులకు గడువు ఇవ్వాలని అకస్మాత్తుగా తాళం వేయడం వల్ల వ్యాపారులు ఇబ్బందులు పడతారని అధికారికి ఎమ్మెల్యే సూచించడంతో షాపులకు మళ్లీ తాళాలు తెరిపించి వెళ్లిపోయారు. ఆమె వెంట ఎంపీవో ప్రసాదరావు, కార్యదర్శి అశోక్‌కుమార్, కేసముద్రం స్టేషన్, విలేజీ జీపీ సిబ్బంది ఉన్నారు.

మేడారానికి ప్రత్యేక బస్సులు

తొర్రూరు డిపో మేనేజర్ విశ్వనాథ్



జాతర బస్సుల వివరాలు వెల్లడిస్తున్న డీఎం విశ్వనాథ్

తొర్రూరు, ఫిబ్రవరి 5 : ములుగు జిల్లా తాడ్వాయి మండలం మేడారం సమ్మక్క-సారలమ్మ మహాజాతరకు తొర్రూరు ఆర్టీసీ డిపో నుంచి ప్రత్యేక బస్సు సర్వీసులు నడపనున్నట్లు డిపో మేనేజర్ బి.విశ్వనాథ్ తెలిపారు. పట్టణంలోని డిపో ఆవరణలో సోమవారం జరిగిన విలేఖరుల సమావేశంలో మాట్లాడుతూ ఈ నెల 18 నుంచి 25వ తేదీ వరకు మేడారం జాతరకు తొర్రూరు డిపో నుంచి 186 బస్సు సర్వీసులను నడిపిస్తామని చెప్పారు. డిపో పరిధిలో తొర్రూరు, వర్ధన్నపేట పాయింట్‌లు ఉంటాయని, బస్టాండ్ ఆవరణలో ప్రత్యేక కౌంటర్లు ఏర్పాటు చేసి ప్రజలకు ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా షామియానాలు, తాగునీరు, కుర్చీలు తగిన సౌకర్యాలు ఏర్పాటు చేస్తామన్నారు. మహాలక్ష్మి పథకంలో భాగంగా మహిళలకు, ట్రాన్స్ జెండర్‌లకు ఉచిత ప్రయాణ సౌకర్యం ఉంటుందన్నారు. తొర్రూరు నుంచి మేడారానికి పెద్దలకు రూ.350, పిల్లలకు రూ.200, వర్ధన్నపేట బస్టాండ్ నుంచి పెద్దలకు రూ.300, పిల్లలకు రూ.160 టికెట్ ధర నిర్ణయించామన్నారు. తొర్రూరు బస్టాండ్ ఆవరణలో 156 బస్సులు, వర్ధన్నపేట బస్టాండ్‌లో 30 బస్సులు అందుబాటులో ఉంటాయని తెలిపారు. సమావేశంలో డిపో సూపరింటెండెంట్ తిరుమల్‌రావు, సీనియర్ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ రజితారెడ్డి, ఎంఎఫ్ విజయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

వైద్య కళాశాల అభివృద్ధికి కృషి చేస్తా

ఎమ్మెల్యే భూక్య మురళీనాయక్



మెడికల్ కళాశాలలో ల్యాబ్‌ను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే మురళీనాయక్

నెహ్రూసెంటర్, ఫిబ్రవరి 5 : మహబూబాబాద్ జిల్లా కేంద్రంలోని వైద్య కళాశాల అభివృద్ధి కోసం కృషి చేస్తానని ఎమ్మెల్యే భూక్య మురళీ నాయక్ అన్నారు. ప్రభుత్వ జనరల్ ఆస్పత్రి, వైద్య కళాశాలను సోమవారం సందర్శించి రికార్డులను పరిశీలించారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే మురళీనాయక్ మాట్లాడుతూ... వైద్య కళాశాలలో నెలకొన్న సమస్యలు తమ దృష్టికి తీసుకురావాలని అధికారులను ఆదేశించారు. అనంతరం విద్యార్థులు అందించిన వినతిపత్రాన్ని స్వీకరించారు. కళాశాలలో క్యాంటీన్ అభివృద్ధి, క్రీడా మైదానం కోసం కృషి చేస్తానన్నారు. ఔట్‌సోర్సింగ్, థర్డ్ పార్టీ లేబర్‌ల నియామకాల్లో అవకతవకలు జరిగినట్లు తమ దృష్టికి వచ్చిందన్నారు. ఈ సంఘటనపై సమగ్ర విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకునే విధంగా కలెక్టర్ దృష్టికి తీసుకువెళ్తానని చెప్పారు. కార్యక్రమంలో ప్రభుత్వ ఆస్పత్రి సూపరింటెండెంట్ బత్తుల శ్రీనివాసరావు, వైద్యా విధాన పరిషత్ సూపరింటెండెంట్ భూక్య వెంకట్రాములు, వైద్య కళాశాల వైస్ ప్రిన్సిపాల్ పి.పద్మ, వార్డు కౌన్సిలర్లు పోతురాజు రాజు, హరిసింగ్, కాంగ్రెస్ పార్టీ అర్బన్ అధ్యక్షులు ఘనపురపు అంజయ్య, నీరుటి లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

అవకతవకలపై విచారణ జరిపించాలి

నెహ్రూసెంటర్ : మహబూబాబాద్ వైద్య కళాశాలలో ఔట్‌సోర్సింగ్, థర్డ్ పార్టీ లేబర్ కొలువుల్లో జరిగిన అవకతవకలపై సమగ్ర విచారణ జరిపించాలని పీడీఎస్‌యూ జిల్లా ప్రధాన కార్యదర్శి బోనగిరి మధు డిమాండ్ చేశారు. జిల్లా కేంద్రంలోని మెడికల్ కళాశాల ప్రధాన గేటు ఎదుట సోమవారం ఆ సంఘం ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా మధు మాట్లాడుతూ... వైద్య కళాశాలలో తాత్కాలిక ప్రతిపాదికన చేపట్టిన ఉద్యోగ నియామకాల్లో అవకతవకలు జరిగాయని ఆరోపించారు. మెరిట్ ఆధారంగా నియామకాలు చేపట్టలేదని పేర్కొన్నారు. సంబంధిత ప్రిన్సిపాల్, ఎంప్లాయిమెంట్ ఆఫీసర్లపై చర్యలు తీసుకుని సనా ఏజెన్సీ లైసెన్స్‌ను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం వైద్య కళాశాల పరిశీలనకు వచ్చిన ఎమ్మెల్యే మురళీనాయక్‌కు వినతిపత్రం అందజేశారు. బాధ్యులపై చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో మునగాల మహేష్, గుగులోతు విజయ్, వినయ్, దిలీప్, వేణు, సంజయ్, చింటూ తదితరులు పాల్గొన్నారు.

మామిడి పిందె దశలో అప్రమత్తంగా ఉండాలి

దంతాలపల్లి, ఫిబ్రవరి 5 : మామిడి పూత, పిందె దశలోనే రైతులు అప్రమత్తంగా ఉండి దిగుబడి పొందాలని మల్యాల శాస్త్రవేత్త డాక్టర్ రాంబాబు అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని రైతు వేదికలో హార్టికల్చర్, వ్యవసాయ అధికారులు సంయుక్తంగా ఏర్పాటు చేసిన అవగాహన సదస్సులో మాట్లాడారు. రైతులు తీసుకోవాల్సిన సమగ్ర యాజమాన్య పద్ధతులు, ఎరువులు, పురుగుల మందుల వాడకంపై అవగాహన కల్పించారు. ఫిబ్రవరి మాసంలో మామిడి తోటలు పూత, పిందె దశలోనే ఉన్నాయన్నారు. చీడపురుగుల నివారణకై సలహాలు, సూచనలు పాటించాలన్నారు. నాణ్యమైన దిగుబడి కోసం మ్యాంగో ఫ్రూట్స్ కవర్స్‌ను వినియోగం చేయాలన్నారు. కార్యక్రమంలో హార్టికల్చర్ అధికారి రాకేష్, ఏఈవో దీక్షిత్‌కుమార్, మల్యాల శాస్త్రవేత్త డాక్టర్ కిషోర్, బేయర్ కంపెనీ ప్రతినిధులు, రైతులు పాల్గొన్నారు.

దేశవ్యాప్త సమ్మెను జయప్రదం చేయాలి

మహబూబాబాద్ టౌన్, ఫిబ్రవరి 5 : ఈ నెల 16న జరుప తలపెట్టిన దేశవ్యాప్త సమ్మెలో అంగన్‌వాడీలు పెద్ద సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని ఏఐటీయూసీ, సీఐటీయూ అనుబంధ తెలంగాణ అంగన్‌వాడీ టీచర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ జిల్లా నేతలు ఆర్.ఎల్లారీశ్వరి, బి.స్నేహబిందు పిలుపునిచ్చారు. మహబూబాబాద్‌లో జిల్లా సంక్షేమ శాఖ అధికారి వరలక్ష్మికి సోమవారం సమ్మె నోటీస్‌ను అందించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ అంగన్‌వాడీ ఉద్యోగులకు నెలకు కనీస వేతనం రూ.26వేలు అందించాలని డిమాండ్ చేశారు. రిటైర్‌మెంట్ అయ్యాక ప్రతి నెల రూ.10వేల పెన్షన్ ఇవ్వాలన్నారు. కార్మిక హక్కులను కాలరాస్తున్న కేంద్ర ప్రభుత్వానికి బుద్ధి చెప్పే విధంగా ఫిబ్రవరి 16న సమ్మెలో అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో కీసర సౌమ్యశ్రీ, ఆండాలు, మహిమూద, సరోజ, పద్మ తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల అభివృద్ధికి తోడ్పాటు అందించాలి

మరిపెడ, ఫిబ్రవరి 5 : గ్రామ పంచాయతీ ప్రత్యేకాధికారులు, కార్యదర్శులతో ఎంపీపీ గుగులోత్ అరుణరాంబాబు స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రజా సమస్యలపై దృష్టి పెట్టి గ్రామాల అభివృద్ధికి తోడ్పాటు అందించాలన్నారు. సమావేశంలో తహసీల్దార్ సైదులు, ఎంపీడీవో ధన్‌సింగ్, గ్రామాలప్రత్యేకాధికారులు పాల్గొన్నారు.

ప్రజా సాహిత్యానికి ప్రాణం పోసిన రచయిత ఆళ్వార్‌స్వామి

నలంద డిగ్రీ కళాశాల కరస్పాండెంట్ సత్యనారాయణ

మహబూబాబాద్ ఎడ్యుకేషన్, ఫిబ్రవరి 5 : ప్రజా సాహిత్యానికి ప్రాణం పోసిన రచయిత, పాత్రికేయుడు వట్టికోట ఆళ్వార్‌స్వామి అని నలంద డిగ్రీ కళాశాల కరస్పాండెంట్ డాక్టర్ డోలి సత్యనారాయణ అన్నారు. మహబూబాబాద్‌లోని స్థానిక కళాశాలలో సోమవారం ఆళ్వార్‌స్వామి వర్ధంతిని పురస్కరించుకొని ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళ్లర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తెలంగాణ ప్రాంతంలో గ్రంథాలయ ఉద్యమం నడిపించి ప్రజలను చైతన్యపరిచిన ఉద్యమనాయకుడిగా నిజాం వ్యతిరేకోద్యమంలో పాల్గొని జైలు జీవితాన్ని గడిపారని పేర్కొన్నారు. రాజకీయ నవలలకు ఆద్యుడిగా, ప్రజల మనిషి, తొలి నవలా రచయితగా ప్రజలను నిరంతరం చైతన్యపరిచారని కొనియాడారు. ప్రతి ఒక్కరూ వట్టికోట ఆళ్వార్‌స్వామిని ఆదర్శంగా తీసుకొని ముందుకు సాగాలని సత్యనారాయణ పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ కృష్ణప్రసాద్, అధ్యాపకులు ప్రసాద్, రమేష్, ఉప్పలయ్య, పాషా, రేణుక, నరేష్, రమేష్, రాజు తదితరులు పాల్గొన్నారు.

పట్టభద్రులు ఓటు నమోదు చేసుకోవాలి

మాజీ ఎమ్మెల్యే బానోత్ శంకర్‌నాయక్

మహబూబాబాద్ టౌన్, ఫిబ్రవరి 5 : నల్లగొండ, ఖమ్మం, వరంగల్ పట్టభద్రుల నియోజకవర్గ ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటు వేసేందుకు పట్టభద్రులంతా తమ ఓటును నమోదు చేసుకోవాలని మాజీ ఎమ్మెల్యే బానోత్ శంకర్‌నాయక్ అన్నారు. మహబూబాబాద్ పట్టణంలో సోమవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ... అమలుకు నోచుకోని మోసపూరిత హామీలతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్‌ను ఎవరూ నమ్మరని చెప్పారు. భావితరాల భవిష్యత్‌కోసం మంచి నాయకున్ని ఎన్నుకోవాలని విజ్ఞప్తి చేశారు. రాష్ట్రంలో, మానుకోట నియోజకవర్గంలో బీఆర్ఎస్ హయాంలో జరిగిన అభివృద్ధి ప్రజలకు తెలుసని వివరించారు. ఒకరిపై ఆరోపణలు చేసే ముందు ఆలోచించాలని హితవు పలికారు. పట్టభద్రుల ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థి విజయం తథ్యమని తెలిపారు. బీఆర్ఎస్ శ్రేణులు అధైర్య పడవద్దని, 24 గంటలు అందుబాటులో ఉంటూ కంటికి రెప్పలా కాపాడుకుంటానని స్పష్టం చేశారు. వచ్చే స్థానిక సంస్థల ఎన్నికల్లో విజయఢంకా మోగిద్దామన్నారు. అనంతరం బీఆర్ఎస్ ఇన్సూరెన్స్ చెక్కులను ఒక్కొక్కరికి రూ.2లక్షల చొప్పున ముగ్గురికి పంపిణీ చేశారు.

బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు రాకేష్‌రెడ్డి మాట్లాడుతూ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో ప్రశ్నించే గొంతుకను శాసన మండలికి పంపిస్తే ప్రజా సమస్యలపై గళమెత్తుతారని అన్నారు. 20 నవంబరు 2020 లోపు డిగ్రీ పూర్తి చేసిన ప్రతీ ఒక్కరు ఓటు నమోదు చేసుకోవాలని కోరారు. గత ఎన్నికల్లో నల్లగొండ, వరంగల్, ఖమ్మం పట్టభద్రుల నియోజకవర్గం నుంచి ఎమ్మెల్సీగా గెలిచిన పల్లా రాజేశ్వర్‌రెడ్డి జనగామ ఎమ్మెల్యేగా గెలవడంతో ఇక్కడ ఎన్నికలు జరుగుతున్నాయని వివరించారు. సమాజంలో విద్యావంతుల పాత్ర కీలకమని ఆ దిశగా ఆలోచించాలన్నారు. ఈ సమావేశంలో మునిసిపల్ ఛైర్మన్ ఎమ్డీ.ఫరీద్, వైస్ ఎంపీపీ ఎల్ది మల్లయ్య, యాకూబ్‌రెడ్డి, మార్నేని వెంకన్న, గద్దె రవి, యాళ్ల మురళీధర్‌రెడ్డి, గోగుల రాజు, తేళ్ల శ్రీనివాస్, మార్నేని రఘు, లూనావత్ అశోక్ నాయక్, నర్సింగం వెంకన్న, బోనగిరి గంగాధర్, కర్పూరపు గోపి, మందుల రఘు, బండి వెంకన్న పాల్గొన్నారు.

జువైనల్ హోంకు బాల నేరస్థుడి తరలింపు

నెల్లికుదురు, ఫిబ్రవరి 5 : మండలంలో ఓ బాల నేరస్థుడిని సోమవారం జువైనల్ హోంకు తరలించినట్లు ఎస్సై క్రాంతికిరణ్ తెలిపారు. జిల్లాలోని ఇనుగుర్తి మండలానికి చెందిన విద్యార్థినిని నెల్లికుదురు మండలానికి చెందిన బాలుడు వేధింపులకు గురిచేయడంతో గత జనవరి 28న పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. హనుమకొండలోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స పొందుతూ ఈ నెల 3న మృతి చెందింది. దీంతో బాలుడిపై ఫోక్సో కేసు నమోదు చేసి సోమవారం జువైనల్ హోంకు తరలించినట్లు ఎస్సై పేర్కొన్నారు.

బాలికల ఆత్మహత్యపై విచారణ జరిపించాలి

మహబూబాబాద్ టౌన్, ఫిబ్రవరి 5 : యాదాద్రి భువనగిరి జిల్లా కేంద్రంలో ఎస్సీ బాలికల వసతి గృహంలో పదవ తరగతి విద్యార్థినులు భవ్యశ్రీ, వైష్ణవిల మృతిపై సమగ్ర విచారణ జరిపించాలని గిరిజన సామాజిక చైతన్య వేదిక వ్యవస్థాపక అధ్యక్షుడు గుగులోతు కిషన్‌నాయక్ సోమవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. ఇద్దరు బాలికలు ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడడం వెనుక కారణాలను వెలికితీసి బాధ్యులైన వారిని గుర్తించి కఠినంగా శిక్షించాలని కోరారు. భవ్యశ్రీ, వైష్ణవిల కుటుంబాలకు న్యాయం చేయాలని ఆయన ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు.

యాజమాన్య పద్ధతులతోనే అధిక దిగుబడులు

నర్సింహులపేట, ఫిబ్రవరి 5 : వరి సాగులో యాజమాన్య పద్ధతులు పాటిస్తేనే అధిక దిగుబడులు సాధ్యమని డివిజనల్ వ్యవసాయ అధికారి శోభన్‌బాబు అన్నారు. మండలంలోని పెద్దనాగారం, గోపతండా,జగ్గుతండా, రామన్నగూడెం, ముంగిమడుగు, నర్సింహులపేట గ్రామాల్లో సోమవారం పర్యటించి వెదజల్లే పద్ధతిలో సాగుచేసిన వరి పంటను పరిశీలించారు. రైతులకు సలహాలు, సూచనలు ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డ్రమ్ సీడర్‌ను లాగేటప్పుడు వరుసకు.. వరుసకు 20 సెంటీమీటర్ల వ్యవధిలో 5 నుంచి 8 గింజలు పడుతాయన్నారు. ఈ పద్ధతి సాగు వల్ల రైతులకు కూలీల బెడద తగ్గుతుందన్నారు. ఎకరానికి రూ.10వేల నుంచి రూ.15వేల వరకు ఖర్చు తగ్గుతుందన్నారు. పంటకు సీజనల్‌గా వ్యాపించే తెగుళ్ల పట్ల అప్రమత్తంగా ఉండాలన్నారు. కార్యక్రమంలో ఏఈవోలు రామకృష్ణ, కరిష్మా, రైతులు పాల్గొన్నారు.

ఎంపీ ఎన్నికల్లో కాంగ్రెస్‌దే హవా..

కేంద్ర మాజీ మంత్రి బలరాం నాయక్

బయ్యారం, ఫిబ్రవరి 5 : త్వరలో జరగనున్న పార్లమెంట్ ఎన్నికల్లోనూ రాష్ట్రంలో కాంగ్రెస్ హవా కొనసాగనున్నట్లు కేంద్ర మాజీ మంత్రి పోరిక బలరాం నాయక్ అన్నారు. సోమవారం మహబూబాబాద్ నుంచి ఇల్లందు వెళ్తున్న ఆయన బయ్యారం బస్టాండ్ సెంటర్‌లో కాసేపు కార్యకర్తలతో ముచ్చటించారు. వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో కార్యకర్తలు సమష్టిగా పనిచేస్తూ కాంగ్రెస్ విజయానికి కృషి చేయాలన్నారు. ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీ మేరకు కాంగ్రెస్ ప్రభుత్వం 100 రోజుల్లో ఆరు గ్యారెంటీలను తప్పక అమలు చేసి తీరుతుందన్నారు. కాంగ్రెస్ అధికారం చేపట్టి పక్షం రోజులు కూడా కాకముందే ప్రతిపక్షాలు విమర్శలు మొదలు పెట్టడం బీఆర్ఎస్ దిగజారుడు తనానికి నిదర్శనమన్నారు. కాగా, మానుకోట పార్లమెంట్ అభ్యర్థిగా దరఖాస్తు చేసుకున్నట్లు బలరాం నాయక్ తెలిపారు. ఏఐసీసీ అండదండలతో తనకే టికెట్ వస్తుందని ఆశాభావం వ్యక్తం చేస్తూ గెలుపుకు కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో మండల కాంగ్రెస్ అధ్యక్షుడు కంబాల ముసలయ్య నాయకులు శ్రీనివాస్‌రెడ్డి, వీరారెడ్డి, సత్తిరెడ్డి, పెద్దినేని వెంకటేశ్వరరావు, శ్రీనివాస్, మోహన్‌రావు పాల్గొన్నారు.

సాధారణ ప్రసవాలు పెంచాలి : కలెక్టర్



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ అద్వైత్‌కుమార్‌సింగ్

మహబూబాబాద్, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి) : కాన్పుల్లో సాధారణ ప్రసవాలను పెంచేందుకు మహిళలకు అవగాహన కల్పించాలని కలెక్టర్ అద్వైత్‌కుమార్‌సింగ్ ఆదేశించారు. మహబూబాబాద్‌లోని కలెక్టరేట్‌లో వైద్యశాఖ అధికారులతో సోమవారం సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ... ప్రతి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వంద శాతం రిజిస్ట్రేషన్ నమోదై ఉండాలన్నారు. కింది స్థాయి సిబ్బందితో సమావేశాలు ఏర్పాటు చేసి పనితీరును పెంచాలన్నారు. అదే విధంగా ఓపీ పెరగాలని తద్వారా నమూనాసేకరణ పెరుగుతుందన్నారు. వైద్యులు అందుబాటులో ఉంటూ లక్ష్యాలు రూపొందించుకుని నిరంతరం పర్యవేక్షించాలన్నారు. కొత్తగూడ, గంగారం వంటి ఏజెన్సీ మండలాల్లో పర్యటించి పీహెచ్‌సీల పనితీరును పరిశీలిస్తామన్నారు. టీబీ టెస్టులు పెంచాలని, వ్యాధి నిర్మూలనకు కృషి చేస్తూ ప్రజల్లో అవగాహన పెంచాలన్నారు. సర్వేకల్ క్యాన్సర్‌ను నిరోధించేందుకు మహిళలతో సమావేశాలు ఏర్పాటు చేయాలన్నారు. 24 గంటలు పని చేసే పది సబ్‌సెంటర్లు బయ్యారం, ముల్కనూరు, డోర్నకల్, కంబాలపల్లి, కోమట్లగూడెం, కొత్తగూడ, దంతాలపల్లి, తొర్రూరు, నెల్లికుదురు, మరిపెడ పీహెచ్‌సీల్లో సిబ్బంది అందుబాటులో ఉండాలన్నారు. సర్కారు వైద్యం పట్ల నిరుపేదల్లో నమ్మకం పెరిగేలా వైద్య సిబ్బంది అంకితభావంతో పని చేయాలని సూచించారు. సమావేశంలో జిల్లా వైద్యాధికారి అంబరీష, డిప్యూటీ డీఎంహెచ్‌వో మురళీధర్, వైద్యులు బిందుశ్రీ, సుధీర్‌రెడ్డి పాల్గొన్నారు.

రైలు ఢీకొని వృద్ధుడి దుర్మరణం

నెహ్రూసెంటర్, ఫిబ్రవరి 5: గేదెలను మేపేందుకు వెళ్లిన ఓ వృద్ధుడు ప్రమాదవశాత్తు రైలు కిందపడి మృతి చెందిన సంఘటన గుండ్రాతిమడుగు-మహబూబాబాద్ రైల్వేట్రాక్‌లమధ్య సోమవారం చోటు చేసుకుంది. డోర్నకల్ జీఆర్పీ ఎస్సై శ్రీకాంత్ తెలిపిన వివరాల ప్రకారం.. కురవి మండలం గుండ్రాతిమడుగు గ్రామానికి చెందిన పోతుల వెంకన్న(60) తనకున్న గేదెలను మేపేందుకు వెళ్లాడు. ఈ క్రమంలో పశువులను రైల్వేట్రాక్ దాటిస్తున్న క్రమంలో అటుగా వస్తున్న రైలు ఢీకొని అక్కడికక్కడే మృతి చెందినట్లు చెప్పారు. కుమారుడు పోతుల రఘు ఇచ్చిన ఫిర్యాదుమేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు. పోస్టుమార్టం నిమిత్తం వెంకన్న మృతదేహాన్ని మహబూబాబాద్ జిల్లా ఆస్పత్రికి తరలించినట్లు తెలిపారు.

నర్సింహులపేటలో దొంగల బీభత్సం

విశ్రాంత ఉద్యోగి ఇంట్లో 8 తులాల బంగారం చోరీ

నర్సింహులపేట, ఫిబ్రవరి 5: నర్సింహులపేట మండల కేంద్రంలో ఆదివారం అర్ధరాత్రి దొంగలు బీభత్సం సృష్టించారు. విశ్రాంత ఉపాధ్యాయుడి ఇంటి తాళం పగలగొట్టి బీరువాలో ఉన్న 8 తులాల బంగారం అపహరించుకు పోయారు. ఎస్సై గండ్రాతి సతీష్ తెలిపిన ప్రకారం.. నర్సింహులపేటకు చెందిన విశ్రాంత ఉపాధ్యాయుడు వేముల ప్రభాకర్‌రెడ్డి భార్య రాధమ్మతో కలిసి విజయవాడలో ఉన్న కుమారుడు దినేష్‌రెడ్డి ఇంటికి 15 రోజుల క్రితం వెళ్లాడు. సోమవారం తిరిగి ఇంటికి వచ్చేసరికి గుమ్మం తాళం పగలగొట్టి ఉంది. గోద్రెజ్ లాకర్‌లో 8 తులాల బంగారు ఆభరణాలు ఉండగా ఎత్తుకెళ్లినట్లు చెప్పారు. బాధితుడు ప్రభాకర్‌రెడ్డి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన ఎస్సై క్లూస్ టీం అధికారులతో విచారణ ప్రారంభించినట్లు తెలిపారు. మేడారం జాతరకు వెళ్లేవారు జాగ్రత్తగా ఉండాలని ఎస్సై సూచించారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి

సీరోలు, ఫిబ్రవరి 5:ఆటో.. కారు ఢీకొనడంతో ఓ యువకుడు మృతి చెందాడు. ఈ సంఘటన మండలంలోని గుజిలీతండా (జుజ్జూరుతండా)లో చోటుచేసుకుంది. ఎస్సై విజయ్‌రామ్‌కుమార్ తెలిపిన ప్రకారం... మరిపెడకు చెందిన బాష్పంగు శ్రీకాంత్(28) ఆదివారం రాత్రి మహబూబాబాద్ నుంచి మరిపెడకు ఆటో నడుపుకుంటూ వెళ్తున్నాడు. ఈక్రమంలో మరిపెడ నుంచి మహబూబాబాద్‌కు వస్తున్న కారు గుజిలితండా వద్దకు రాగానే ఎదురుగా వస్తున్న ఆటోను ఢీకొట్టింది. ఈ ఘటనలో ఆటో డ్రైవర్ శ్రీకాంత్‌కు తీవ్ర గాయాలయ్యాయి. గమనించిన స్థానికులు చికిత్స నిమిత్తం 108 అంబులెన్స్‌లో మహబూబాబాద్ జిల్లా ఆస్పత్రికి తరలించారు. అప్పటికే శ్రీకాంత్ మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. శ్రీకాంత్ బంధువు మధుకర్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసి దర్యాప్తుచేస్తున్నట్లు ఎస్సై విజయ్ రామ్‌కుమార్ తెలిపారు.

ముల్కలపల్లిలో ఒకరు..

డోర్నకల్, ఫిబ్రవరి 5 : మండలంలోని ముల్కలపల్లికి చెందిన షేక్ జానీమియా(37) అనే వ్యక్తి ఖమ్మం రూరల్ మండలం ఎం.వెంకటాయపాలెం వద్ద ఆదివారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందారు. బంధువులు, స్థానికులు తెలిపిన ప్రకారం... గ్రామానికి చెందిన జానీమియా కొంతకాలంగా ఖమ్మంలో పాన్‌షాప్ పెట్టుకుని అక్కడే అద్దె ఇంట్లో ఉంటూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. ఆదివారం స్వగ్రామమైన ముల్కలపల్లికి వచ్చి పనులు ముగించుకుని రాత్రి తన ద్విచక్ర వాహనంపై ఖమ్మంకు వెళ్తున్నాడు. ఎం.వెంకటాయపాలెం వద్దకు చేరుకోగానే వాహనం అదుపుతప్పి కిందపడడంతో జానీమియాకు తీవ్ర గాయాలయ్యాయి. గమనించిన స్థానికులు 108 ద్వారా ఖమ్మంలోని ఆస్పత్రికి తరలించగా, మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. మృతుడికి భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు.

టీపీటీఎఫ్ రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయాలి



చిన్నవంగరలో పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న టీపీటీఎఫ్ నాయకులు

పెద్దవంగర, ఫిబ్రవరి 5 : విద్యారంగ, సామాజిక, సమకాలీన పరిస్థితుల కోసం ఉపాధ్యాయుల్లో చైతన్యం కల్పించేందుకు ఈ నెల 11, 12 తేదీల్లో ఖమ్మం జిల్లాలో జరిగే టీపీటీఎఫ్ రాష్ట్ర ద్వితీయ విద్యా, వైజ్ఞానిక మహాసభలను జయప్రదం చేయాలని టీపీటీఎఫ్ జిల్లా కార్యదర్శి సోమరపు ఐలయ్య, మండల అధ్యక్షుడు చిక్యాల సతీష్ పిలుపు నిచ్చారు. సోమవారం మండలంలోని చిన్నవంగర కేజీబీవీ పాఠశాలలో టీపీటీఎఫ్ రాష్ట్ర ద్వితీయ మహాసభల పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు బడ్జెట్‌లో విద్యా రంగానికి తక్కువ నిధులు కేటాయిస్తూ నిర్లక్ష్యం చేస్తున్నాయని తెలిపారు. కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన నూతన విద్యా విధానంతో విద్యలో ప్రైవేటీకరణ బలోపేతమయ్యే విధంగా ఉందన్నారు. కార్యక్రమంలో యుగేందర్, సురేష్, వెంకటేశ్వర్లు, శ్రీనివాస్, మురళి, వెంకటేశం, స్రవంతి, సైదమ్మ, కల్యాణి, సరిత, శ్రీలత సంధ్యారాణిపాల్గొన్నారు.

● బయ్యారం : ఖమ్మం పట్టణంలో 11, 12 తేదీల్లో జరిగే టీపీటీఎఫ్ రాష్ట్ర విద్యా వైజ్ఞానిక రెండో మహాసభలకు సంబంధించిన పోస్టర్లను బయ్యారంలో సోమవారం సంఘం నాయకులు ఆవిష్కరించారు. ఈసందర్భంగా సంఘం జిల్లా కార్యదర్శి ఉప్పలయ్య మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విద్యా రంగానికి నామమాత్రపు నిధులు కేటాయిస్తూ నిర్లక్ష్యం చేశారని ఆరోపించారు. విద్యలో ప్రైవేటీకరణ, కాషాయీకరణ వేగవంతం చేస్తూ దేశాన్ని తిరోగమనంలోకి తీసుకెళ్తున్నారని విమర్శించారు. కార్యక్రమంలో సంఘ బాధ్యులు, ఉపాధ్యాయులు షేక్ మీరా, లక్ష్మయ్య, వెంకటేశ్వర్లు, శ్రీను, వీరన్న, సరోజ, కవిత, విమల, వసంత, పద్మ, రామనాథం పాల్గొన్నారు.

12 శాతం కూలీ రేట్ల పెంపునకు అంగీకారం

కేసముద్రం, ఫిబ్రవరి 5 : కేసముద్రం మార్కెట్ పరిధిలోని మిల్లులు, ట్రేడింగ్ కంపెనీల వద్ద పనిచేసే కార్మికులకు 12 శాతం కూలీ రేట్ల పెంపునకు యాజమాన్యాలు అంగీకరించినట్లు ఇఫ్టూ రాష్ట్ర నాయకుడు శివారపు శ్రీధర్ తెలిపారు. మార్కెట్ కార్యాలయంలో సోమవారం ప్రత్యేక హోదా కార్యదర్శి అమరలింగేశ్వర్‌రావు సమక్షంలో వ్యాపారులు, కార్మికుల మధ్య చర్చలు నిర్వహించారు. పెరిగిన కూలీ రేట్ల ఒప్పందం ఈ ఏడాది జనవరి 1 నుంచి రెండేళ్ల వరకు అమలులో ఉంటుందని శ్రీధర్ తెలిపారు. కార్యక్రమంలో ఛాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు తోకల శ్రీనివాస్‌రెడ్డి, వోలం మురళి, శ్రీరాం వెంకన్న, సట్ల శ్రీనివాస్, ఏఐసీటీయూ జిల్లా అధ్యక్షుడు వెంకన్న, వెంకన్న పాల్గొన్నారు.

పరిశ్రమల ప్రైవేటీకరణను నిలుపుదల చేయాలి

బయ్యారం, ఫిబ్రవరి 5: కేంద్రంలో మోదీ ప్రభుత్వం చేపడుతున్న పరిశ్రమల ప్రైవేటీకరణను నిలుపుదల చేయాలని ఐఎఫ్‌టీయూ రాష్ట్ర అధ్యక్షుడు ఆరెల్లి క్రిష్ణ అన్నారు. కేంద్ర ప్రభుత్వం అవలంబిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలకు నిరసనగా ఐఎఫ్‌టీయూ, మాసా జాతీయ కమిటీ పిలుపులో భాగంగా బయ్యారంలో సోమవారం ప్రదర్శన చేపట్టారు. ఈ సందర్భంగా క్రిష్ణ మాట్లాడుతూ తొమ్మిదేళ్ల కాలంలో మోదీ ప్రభుత్వం 29 కార్మిక చట్టాలను రద్దుచేసి నాలుగు లేబర్ కోడ్‌లను తీసుకొచ్చి కార్మికులను కట్టు బానిసలను చేస్తుందని విమర్శించారు. ఇప్పటికైనా కేంద్ర ప్రభుత్వం స్పందించి లేబర్ కోడ్‌లను రద్దు చేస్తూ కార్మికులకు కనీస వేతనం రూ.26 వేలు చెల్లించేలా చట్ట సవరణ చేయాలన్నారు. కార్యక్రమంలో ఇఫ్టు రాష్ట్ర ఉపాధ్యక్షుడు జె.సీతారామయ్య, తెలంగాణ టైల్స్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర వర్కింగ్ అధ్యక్ష, కార్యదర్శులు రాంసింగ్, మదార్, వీరభద్రం, లక్ష్మీనారాయణ, రాంబాబు, రవి, ఆదినారాయణ, పాషా పాల్గొన్నారు.

నిధుల దుర్వినియోగంపై విచారణ చేపట్టాలి



పట్టణంలోని గాంధీ విగ్రహం వద్ద నిరసన వ్యక్తం చేస్తున్న కాంగ్రెస్ శ్రేణులు

డోర్నకల్, ఫిబ్రవరి 5: డోర్నకల్ మునిసిపాలిటీలో నిధుల దుర్వినియోగంపై తక్షణమే విచారణ చేపట్టాలని కాంగ్రెస్ పట్టణ ఉపాధ్యక్షుడు ఎల్లావుల హరికృష్ణ డిమాండ్ చేశారు. పట్టణంలోని గాంధీ సెంటర్‌లో సోమవారం కాంగ్రెస్ శ్రేణులతో కలిసి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా హరికృష్ణ మాట్లాడుతూ... మునిసిపల్ పాలకవర్గాన్ని తక్షణమే రద్దు చేయాలన్నారు. మునిసిపాలిటీలో నిధులు దుర్వినియోగం అయ్యాయని కౌన్సిలర్లే జిల్లా ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేసినందున తక్షణమే పాలకవర్గాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు రెడ్డబోయిన శంకర్, రాహుల్, ఎడమకంటి రవి, ప్రవీణ్‌బాబు, సాదనాల వెంకటేశ్వర్లు, దాసరి నాని, తారాచంద్, ఖాసీం, ఖాదర్‌బాబా, ఫరీద్, వీరస్వామి, కృష్ణమూర్తి, నందానాయక్, షకీల్, మహేష్, భాస్కర్, రవీందర్, వీరస్వామి పాల్గొన్నారు.

పంచాయతీ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

తొర్రూరు, ఫిబ్రవరి 5: రాష్ట్ర వ్యాప్తంగా సుమారు 13వేల గ్రామ పంచాయతీల్లో పని చేస్తున్న కార్మికుల సమస్యలు పరిష్కరించాలని తెలంగాణ ప్రగతిశీల గ్రామ పంచాయతీ వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు పాండ్య బీకూ అన్నారు. సోమవారం డివిజన్ కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీడీవో కుమార్‌కు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మల్టీపర్పస్ వర్కర్స్ పని విధానాన్ని రద్దుచేసి పెరిగిన నిత్యావసరాల ధరలకు అనుగుణంగా వేతనాలు పెంచాలన్నారు. జీవో 60 ప్రకారం వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో పంచాయతీ సిబ్బంది నర్సయ్య, యాకన్న, దేవేందర్, వంశీ, విష్ణు, యాకన్న పాల్గొన్నారు.

విద్యార్థుల పట్ల ప్రత్యేక శ్రద్ధ వహించాలి

పెద్దవంగర, ఫిబ్రవరి 5: ఉపాధ్యాయులు విద్యార్థుల పట్ల ప్రత్యేక శ్రద్ధ వహించాలని మండల నోడల్ అధికారి బుదారపు శ్రీనివాస్ అన్నారు. సోమవారం మండలంలోని ఉప్పరగూడెం ప్రాథమికోన్నత పాఠశాలను తనిఖీ చేశారు. విద్యార్థుల హాజరు నమోదు, రికార్డులను పరిశీలించారు. విద్యార్థుల ప్రతిభా సామర్థ్యాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మెనూ ప్రకారం నాణ్యమైన భోజనం అందించాలన్నారు. కష్టపడి చదివి ఉన్నత స్థానాలకు చేరుకోవాలని సూచించారు. హెచ్ఎం నరేందర్‌రెడ్డి, ఉపాధ్యాయులు తస్కీం, రామరాజు, సీఆర్పీ పాల్గొన్నారు.